# శ్రీనివాస విలాసము

*(కలియుగ ప్రత్యక్షదైవమైన శ్రీవేంకటేశ్వర*
*స్వామివారిని ప్రస్తుతించు పద్యరచన)*


రచయిత

**విద్వాన్ ముదివర్తి కొండమాచార్యులు**



ప్రచురణ

**కార్యనిర్వహణాధికారి**

**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.**

**2013**

# SRINIVASA VILASAMU

**By**
**Vidwan Mudivarti Kondamacharyulu**

T.T.D. Religious Publications Series No. 998
© All Rights Reserved

*First Edition : 2013*

Copies : 1000

*Published by :*
**L.V. SUBRAHMANYAM**, I.A.S.,
Executive Officer
Tirumala Tirupati Devasthanams
Tirupati.

***D.T.P:***
Office of the Editor in Chief
T.T.D, Tirupati.

*Printed at :*
***Tirumala Tirupati Devasthanams Press***
Tirupati.

# ముందుమాట

**వేంకటాద్రిసమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన,**
**వేంకటేశసమో దేవో న భూతో న భవిష్యతి.**

'శ్రీనివాస విలాసం' అనే ఈ కావ్యం అఖిలాండ కోటిబ్రహ్మాండ నాయకుడైన శ్రీవేంకటేశ్వరస్వామివారి స్వరూప రూపగుణ విభవైశ్వర్యాదులను ప్రస్తుతించే పద్యరచన. రచయిత శ్రీముదివర్తి కొండమాచార్యులు.

ఈ పుస్తకంలోని 'శ్రీనివాసస్తుతి', 'నివేదనం' అనే తొలిరెండు శీర్షికలు బహుళవ్యాప్తిలో ఉన్న పూర్వాచార్యుల సంస్కృత రచనలు. వీటిలో 'నివేదనం' ప్రతిదినం కొండమీద స్వామివారి ఊంజల్ సేవ కడపట ఆస్థాన వేద విద్వాంసులచేత స్వామివారి సముఖంలో పఠించబడుతుంది. దీనిని చదువరులు అనునిత్యం పఠించి తరించుట కొరకు రచయిత తమ గ్రంథంలో చేర్చారనిపిస్తుంది.

"స్వామీ! వేంకటనాథ! అని జగజ్జనకుని సంబోధిస్తూ చేసిన కృతి సమర్పణంతో మొదలై, విష్ణుపత్ని! నమోఽస్తుతే విశ్వజనని" అనే లోక జనయిత్రి పద్మావతి అమ్మవారి స్తుతితో ముగిసే ఈ కృతిలో పదహారు శీర్షిక లున్నాయి. షోడశ కళానిధికి షోడశోపచారములని అన్నమాచార్యుల వారు చెప్పినట్లు ఈ పదహారు శీర్షికల క్రింద స్వామివారిని కీర్తించిన పద్యాలసంఖ్య రమారమి రెండునూర్లు. ఒక గంట సేపట్లో చదువుకొని సంతోషించవచ్చు.

ముదివర్తి కొండమాచార్యులుగారు తిరుపతి కవులు మొదలు దేశంలో పేరుపొందిన మహాకవుల ప్రశంసలకు పాత్రమైన పద్యగద్యరచన లెన్నో చేశారు. దేవస్థానములు ప్రకటించిన బమ్మెరపోతన భాగవతం తాత్పర్య రచనలో, కవిత్రయ మహాభారతం వ్యాఖ్యానంలో పాలుపంచుకొన్నారు. పదకవితా పితామహులు తాళ్లపాక అన్నమాచార్యులవారి అధ్యాత్మ సంకీర్తనల్లో దాదాపు పదిహేను వందల పదాలు సీసపద్యాలలోనికి మలచిన కవిశేఖరులు వీరు.

సంప్రదాయమూ, సాహిత్య శిల్పమర్మమూ తెలిసిన ముదివర్తి వారి శ్రీనివాస విలాస కావ్యం దేవస్థానముల స్వీయప్రచురణగా స్వీకరించి వెలువరించడానికి ఎంతో సంతోషిస్తున్నాం.

ఈ పుస్తకం భక్తజనానుమోదం పొందగలదని విశ్వసిస్తున్నాం.

తిరుపతి,

-2-2013

లంక వెంకట సుబ్రహ్మణ్యం
కార్యనిర్వహణాధికారి
తి.తి.దేవస్థానములు, తిరుపతి

## కృతజ్ఞతలు : ధన్యవాదాలు

శ్రీ వేంకటేశ్వర స్వామివారి స్తుతిరూపమైన నా శ్రీనివాస విలాస పద్యకృతిని తి.తి.దేవస్థానములు స్వీయప్రచురణగా స్వీకరించుటకు తోడ్పడిన తి.తి.దే. పుస్తక ప్రచురణ విభాగ ప్రధాన సంపాదకులు 'మహామహోపాధ్యాయ', ఆచార్య రవ్వా శ్రీహరిగారికీ, నాయందు పరమానుగ్రహంతో నా యీ రచనపై అమూల్యాభిప్రాయా లిచ్చిన విద్వత్కవి పుంగవులు 'అభినవ భారతి' శ్రీ తుమ్మపూడి కోటీశ్వర రావుగారికీ, వైయాకరణ సార్వభౌములు 'మహామహోపాధ్యాయ' శ్రీమాన్ కందాళ వేంకట రామకృష్ణమాచార్యుల వారికీ జోతలర్పిస్తున్నాను.

శ్రీనివాస విలాసకావ్యం దేవస్థాన ప్రచురణగా ఆదరించిన ఉదారహృదయులు తి.తి.దే. కార్యనిర్వహణాధికారి మాన్యశ్రీ ఎల్.వి.సుబ్రహ్మణ్యం, ఐ.ఏ.ఎస్. గారినీ, సంయుక్త కార్యనిర్వహణాధికారి మాన్యశ్రీ పి.వేంకట రామిరెడ్డి, ఐ.ఏ.ఎస్. గారినీ ఛందోమయ వాణితో వినమ్రుడనై కీర్తిస్తూ వారికి అంజలి ఘటిస్తున్నాను.

క. వేంకటశైలాధీశ్వరు
కైంకర్యపరప్రధాను ఘను శ్లాఘింతున్
వేంకట సుబ్రహ్మణ్యున్
లంకాన్వయ కలశజలధి రాకాచంద్రున్.

ఉ. ఆ మహనీయమూర్తి పరమాత్ముఁడు మెచ్చు పవిత్రకార్యముల్
నీమముతోడ సల్పు దృఢ నిర్మల మానసుఁడంచు, సద్గుణ
స్తోముఁ డటంచు, సూనృత విశోభితుఁడంచు, సుధీజనావళీ
క్షేమకరుం డటంచు, నయశీలుఁ డటంచు నమస్కరించెదన్.

సీ. కొండలప్పని నిండు కొల్వులో సంయుక్త
కార్యనిర్వహణాధికారి యెవఁడు?

పద్మావతీ ప్రాణపతి భక్తుఁడేగాక
గురుభక్తి యుక్తుఁడై వరలు నెవఁడు?
సంగీతసాహిత్య సరసవిద్యలయందు
పరమానురక్తుఁడౌ ప్రాజ్ఞుఁ డెవఁడు?
పండితకవి పద్మవనికి మార్తాండుఁడై
వితరణ శీలియై వెలయు నెవఁడు?

తే. అట్టి మహితాత్ము పొప్పసాన్యన్వవాయు
రాజితయశస్కు వేంకటరామిరెడ్డి
రాణ్మహేంద్రుని కీర్తింతు రమ్యగుణుని,
నిష్కళంక చరిత్రుని, నీతియుతుని.

ఇట్లు
బుధజన విధేయుడు
**ముదివర్తి కొండమాచార్యులు**

తిరుపతి
09-02-2013



అభినవ భారతి
**డా॥ తుమ్మపూడి కోటీశ్వర రావు** గారు
సమన్వయకర్త
హరివంశ వ్యాఖ్యాన ప్రాజెక్టు, అన్నమాచార్య ప్రాజెక్టు
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి. 05.01.2013

# కవితావైష్ణవము

**వి**టుల వంచించు నంగనావేషధారి (పుట 41-14) పద్యం చమత్కారంగా వుంటూనే పాఠకుని వంచిస్తుంది, తన యథార్థ అర్థాన్ని మాటుచేసి. వేదాంత దేశికు లన్నారు గోదాస్తుతిలో. సృష్టికారణ మనేకు లనేక రకాలుగా చెప్పారు - కానీ నేనంటాను నీ మీది ప్రేమతో చేసినాడు అని. జీవకోటిని విషయ పరతంత్రులుగా చేయటం నీ పరీహాసమునకే అనడం తత్సంబంధ మైనదే.

నిన్ను నిర్గుణుండంచునెటులాడ నేర్తునయ్య (పుట 8. పద్యం 19) శ్రీ వైష్ణవం సామీప్య సారూప్య సాలోక్య ముక్తినే పెద్దచేసి చెప్పినది తప్ప అద్వైతంలాగా సాయుజ్యం చెప్పలేదు. దీనినే తెనాలి రామకృష్ణుడన్నాడు. **"హరిభుక్త మాత్మభార్య - భక్తి నిడ భుక్తిఁ గొనుచున్కిముక్తిగాని, నిదురవంటిది ఱాతివంటిదియుఁగాదు** (5-216). **కీలారములనుండి** - పద్యాంతంలో గార్హస్థ్యము నంగీకరించిన శ్రీ వైష్ణవంలో సాయుజ్యముక్తి స్వరూపమిదిగా కాశ్మీర శివాద్వైతవాదులున్నూ చెప్పారు.

**'అస్థాస్య దేకరూపేణ వపుషా చేన్మహేశ్వరః**
**మహేశ్వరత్వం సంవిత్త్వం తదత్యక్షత్ ఘటాదివత్.'**

అని శ్రీమదభినవగుప్తుల సిద్ధాంతవాక్యం.

(పరతత్త్వం నానారూప ధారణం చేయకుండా ఏకంగానే వుండివుంటే అప్పుడతడు మహేశ్వరుడు కాదు;అది సంవిద్ఘనమూ కాదు. కేవలం మట్టికుండ.)

ఇంత వేదాంత విద్యను గర్భీకరించుకొన్న చిన్న పద్యమిది.

**"గుడి గట్టకున్న కట్టిన**

**గుడిఁజొచ్చి నమోఽచ్యుతాయ గుణినే"** (పుట 9 – పద్యం 6) యని – శ్రీమన్నారాయణుడు సకల కల్యాణగుణ స్వరూపుడని లోకానికి కన్ను విప్పినది శ్రీవైష్ణవం. ఇదే విషయం చెప్పిన పద్యమిది.

**"నేను నాకున్నదంతయు – సీతాకళత్ర!"** (పుట 10 – పద్యం 12)

33వ పుటలోని 7వ పద్యంలో **చరమ శ్లోకార్థము –**

**'సీతాకళత్ర'**అనటం వల్ల రామావతారంలోని విభీషణునకిచ్చిన అభయరూప శ్లోకం – రామాయణచరమం. చరమ శ్లోకార్థ మనటంలో గీతా వరాహ చరమములు స్మరించాలి.

**"ద్వయ మష్టాక్షరి"**(పుట 16 – 14) పైతృకధనంగా చెప్పిన మంత్రస్వరూపం శ్రీవైష్ణవ బీజాక్షర సంపుటి.

**"నలువన్ గాంచినవాఁడు భూభువన జన్మస్థేమ భంగాది లీ**

**లలు గావించెడు వాఁడు** – అన్న పుట 18 – 28 పద్యంలోది. ప్రారంభంలోది శ్రీనివాసస్తుతిలోని శ్రీమద్రామానుజముని శ్రీ భాష్యారంభ ప్రార్థన శ్లోకంలోని భావాన్ని అందిపుచ్చుకొని వచ్చిన కమనీయ పద్యం. ఇదీ కవితావైష్ణవమంటే. కవితాకృతి ధరించిన శ్రీవైష్ణవ విభూతి.

**'ఎవరిదారి వారిది'** అన్న ఖండికలో నాచ్చియార్ తిరుమొళి స్వప్నమాధుర్యం తొంగిచూడటం లేదా?

**"పలు పోకలుగల మర్త్యుల"** పుట 8–16 పద్యంలో –

**"తలిరుల తుదఁజినుకులు జల**

**జల వడియఁగఁ దడిసి మెలఁగు చలి కరువలి ను**



**న్బొలపమున విరియు పరువపుఁ**

**దొలు మొగడల వలపు దెలుపు తోఁటల లోనన్"** (5–104)

అన్న తిమ్మన్నగారి పారిజాతం వలపు స్ఫురించటం లేదా? అలాగే **"జయ గోవింద ముకుంద కేశవ హరే శౌరే మురారే రమాప్రియ"** అన్న ఎత్తుగడ స్తుతిలో–

**"జయ గోవింద! ముకుంద! చక్రధర! కంసద్వేషి! సాత్రాజితీ ప్రియ"** అన్న పారిజాతంలోని (2–36) కృష్ణుని గురించి చేసిన వైతాళిక గానమాధుర్యం కర్ణేంద్రియాలకు తాకుతూనే వుందికదా!

ఏ కవి వ్రాసినా ఆ కావ్యంలో ప్రాచీన కవితాసరస్వతి అనురణన రూపంలో మ్రోగుతూనే వుంటుంది. తత్పూర్వ మహాకవులు తొంగిచూస్తూ వుంటారు. అది లేకుండా ఎవడూ వ్రాయలేడు.

**"నీకు జోహార్ల"**న్న ఖండికలో అన్నీ కందాలు (గీతాలు కొద్దిగా). అమిత తెలుగుదనం. జాజిపూల సుకుమార వాసనలను విరజిమ్ముతున్నాయి (పుటలు 5–6) పుట 6–11వ పద్యంలో **'తలఁపు విరిదమ్మి గద్దియ'** సమాసమెంత మృదువుగా పొదుగబడినది – ఉంగరంలో "నీలం" లాగా. పుట 7–16వ పద్యంలోని **"కద్దాయమ్ముగ"** శబ్దం కొంచెం పాఠకునకు అడ్డంగా తోచవచ్చునేమోకాని చివరిపాదంలోని**"జిడ్డును బాపుకొను వెరవు చెప్పఁగదయ్యా!"** అన్న వాక్యంలోని **'జిడ్డు'** కర్మబంధమన్న అర్థంలో ప్రయోగింపబడటం చాలా సొగసుగా వుంది.

**'దీవనకోలులే'** – నీకు జోహార్లు అనే ఖండిక ప్రారంభ పద్యంలోనిది. పుట 13 – 27వ పద్యంలోని **"ఏటికోళ్ళు"** వంటి తెలుగుమాటలెన్నో ఇందులో దర్శనమిస్తాయి. **"పామునోటఁ జిక్కి ప్రాణముల్ గోల్పోవ"** పుట 31 – 3వ

పద్యంలో మానవ స్వభావంలోని దౌర్బల్యమెంత హృదయ విదారకముగా చిత్రింపబడినదో!

స్త్రీ పర్వంలో సంజయుడు ధృతరాష్ట్రునకు పది పద్యాల్లో జీవుని స్వభావమేమో వివరిస్తాడు. అదొక అందమైన ఉపాఖ్యానం. దాని ననుసరించి నేను నా కుమార భారతి అన్న కావ్యంలో ఆ భావాన్ని కుదించి వ్రాసిన మధ్యాక్కర:

**"కుహువున ద్వీపిరాట్ప్రముఖ ఘోరజాంతవ పంక్తి చూడ**
**గహనాంధువునఁగూలి లోనఁ గాలాహులుండ లతాంత**
**కుహరమ్మునన్ జిక్కి దుఃఖ కుల్యయై దూరంపుఁ బండ్ల**
**విహరించునాస జీవించు విధి మూర్ఖుడట్లౌదె నీవు"**

అని తారకునికి హితబోధ చేస్తాడు అగ్ని.

ఈ **"పామునోటఁ జిక్కి"** అన్న ఆలోచన రావటానికి జీవితమెంత పండబార వలెనోకదా!

ఈ లఘుకృతిలో 14 ఖండికలు రెండునూర్లు పద్యాలు ఉన్నాయి. ఇందులో **వేంకటాద్రి విభుడు – విష్ణుపత్ని** అన్న ఖండికలు చిత్రంగా రెండూ 36 – 36 పద్యాల్లో అమరినవి. ఈ వైచిత్రి విశ్వవిభుని దాంపత్యంలోని సమతాధర్మాన్ని బోధించటం కదా! ఇది ఎవరు చేసిన అమరిక!

**"ఎవనినాభినుండి ఈ విశ్వ ముదయించు**
**ఎవని గర్భమందు నిమిడియుండు**
**ఎవఁడు దీనిఁబ్రోచు నెవనియం దిదిడిందు**
**వాని శేషశైలవాసు నెంతు"** (పుట 19–6)

అన్న పద్యంలోని వాఁడు తప్ప కవి ఊహించి వ్రాసినాడనలేము కదా! ఆ పద్యంలో పోతన్నగా రెంత ఒదిగి కూర్చున్నారో చిత్రంగా! దీని సంగతి నలావుంచి



శేషశైలవాసునికి కవిగారు స్వాత్మనివేదనగా అర్పించిన ఈ లఘుకృతి తెనాలి రామకృష్ణయ్య అన్నట్లు –

**స్కందపురాణ నీరనిధిఁ గౌస్తుభమై తులకించు దేవకీ**
**నందను సత్కథోద్యమము నవ్యకవిత్వ కళాకలాపమన్**
**కుందనమున్ ఘటించి కడుక్రొత్తగు సొమ్మొనరించి విష్ణు సే**
**వం దిలకించు నప్పరమ వైష్ణవకోటి నలంకరింపుమీ!**

**– అలంకరింపదే** – అని అనగలం.

కవిగారు నాకు వృద్ధసఖులు. వారి ఆనతిబడి నాల్గుమాటలు వారు వ్రాయమన్నా నాల్గుపుటలు వ్రాయటం ఆ శేషశైలవాసుని ఆనతియే!

"మహామహోపాధ్యాయ"
**ప్రొఫెసర్ కె.వి. రామకృష్ణమాచార్యగారు**
విశ్రాంత కులపతులు
జగద్గురు రామానందాచార్య సంస్కృత విశ్వవిద్యాలయము
జైపూర్, రాజస్థాన్.

# ఆచార్య వరివస్య

**శ్రీమతే రామానుజాయ నమః**

**ఆచార్యకొండమార్యేభ్యో నమోవాకం ప్రశాస్మహే।**
**యైరాంధ్రకవిదిగ్దన్తి శ్రేణీ సమ్యగలంకృతా॥**

విద్వత్కవిశేఖరులు గురుకల్పులు ఉ॥వే॥ శ్రీమాన్ కొండమాచార్య స్వామివారిని తెలియని తెలుగువాడు లేడన్న అతిశయోక్తికాదు. చిక్కని చక్కని తేటతెలుగులో అలవోకగా కవిత్వం చెప్పటం వారికి వెన్నతో పెట్టిన విద్య. జానపదానికి పెద్ద పీట వేస్తున్న ప్రస్తుత తరుణంలో ఇటు జానపదాన్ని అటు గ్రాంథికాన్ని సమపాళ్ళలో రంగరించి తీర్చిదిద్దిన కవిత్వం వీరిది. అందువల్లనే వీరి కవిత్వం అటు పండితుల్ని ఇటు పామరుల్ని కూడా అలరిస్తోంది. స్వామివారు ఎంతటి మహానుభావులో అంతటి ఆత్మగుణపూర్ణులు. వీరు మూర్తీభవించిన వైష్ణవం అంటే అతిశయోక్తికాదు. పైపైకి వైష్ణవాన్ని ప్రదర్శించే తత్త్వంకాదు వీరిది. 'దాసస్యదాస ఇతి మాం స్మర లోకనాథ' యని కులశేఖరులన్నట్లుగా అదే భావనతో శ్రీనివాసుని ఆరాధించు స్వభావం వీరిది.

ఆచార్యులవారు తాము రచించిన శ్రీనివాసవిలాసానికి అభిప్రాయం వ్రాసి పంపవలసినదిగా నన్నాదేశించారు; సుమారుగా 45 ఏళ్ళక్రితం నేను భాషాప్రవీణ పరీక్ష కోసం వీరి 'నారాయణమ్మ' ను చదివాను. అప్పటినుండే స్వామివారికి నేను శిష్యుడనైనాను. శ్రీనివాసుని కృపవల్ల నాకు విద్యాపీఠంలో ఉద్యోగం రావటం, ఆచార్యులవారు రిటైరై తిరుమల తిరుపతి దేవస్థానం పుస్తక ప్రచురణ విభాగంలో ఉపసంపాదకులుగా రావటం మూలంగా స్వామివారి దర్శన భాగ్యమేకాకుండా, వారితో ఒకింత పరిచయం కూడా ఏర్పడింది. దాదాపు అప్పటినుండి ఆచార్యులవారి అనుగ్రహానికి పాత్రుడనవుతూనే ఉన్నా. నిజం చెప్పాలంటే వారి కవితా వ్యాసంగానికి ఉన్నంత వయస్సులేదు నాకు. పైగా నేను వారికి శిష్యప్రాయుణ్ణి. అటువంటి నేను వారి కృతికి అభిప్రాయం వ్రాయడమా? ఇంతకంటె హాస్యాస్పదం ఇంకొకటి ఉంటుందా? అటు స్వామివారి ఆదేశం, ఇటు ఔచిత్యం ఈ రెండింటి మధ్య కొట్టుమిట్టాడుతూ, చివరకు గురువుల యాజ్ఞనే శిరసావహించాలనే నిర్ణయానికి వచ్చి ఈ రెండు మాటలు వ్రాయడానికి సాహసిస్తున్నా. నాఈ ధార్ష్ట్యాన్ని మన్నించ వలసిందిగా పెద్దలందర్నీ ప్రార్థిస్తున్నా.

గురువర్యులు వాచస్పతి శ్రీమాన్ ఎన్.సి.నరసింహాచార్యస్వామివారి ముక్తక మౌక్తికాలను చక్కని తెలుగులో నుడికారం చెడకుండా అలవోకగా అనువదించి, అక్కడక్కడ మూలానికే వన్నెతెచ్చి, ఆచార్యులు అందరి మన్ననలు పొందిన విషయం మనకందరకు తెలిసినదే. స్వయంగా కవితలల్లటం ఒక ఎత్తైతే అనువదించడం మరొకఎత్తు. భావం, నుడికారం చెడకుండా సరసంగా సరళంగా అనువదించడం కష్టసాధ్యం. భర్తృహరి సుభాషితాదుల ననువదించిన వారు కూడా చాలా కష్టపడ్డారు. కాని ఆచార్యులవారి అనువాదాన్ని అనువాదంగా ఎవ్వరూ అనుకోరు. అలతి అలతి పదాలతో గంభీరమైన భావాన్ని అలవోకగా అభివ్యక్తీకరించే ప్రతిభ వీరిది.

ఇక ప్రస్తుతానికి వస్తే–

**చిరునగవు చిందు మోమును**
**వరదాభయ హస్తములును వనమాలికయున్**
**కరుణవిరియు కన్నులుగల**
**తిరుమలనాయకుని కిడెద దీవన కోలుల్.**

అని స్వామివారి మంగళాశాసనంతో ఆరంభించి,

**"మాత! పద్మావతీ జయమంగళమ్ము"–**

అని తల్లి పద్మావతికి మంగళాశాసనంతో ముగించిన ఈ శ్రీనివాస విలాసంలో ప్రతిపద్యం ఒక ముక్తక మౌక్తికమే. గాథాసప్తశతి మాదిరి ఒక్కొక్క పద్యం ఒక్కొక్క కావ్యమే. **"కమనీయార్థ సుధానిధానము. జగత్కల్యాణసంధాయి. ఈ రమణీయస్తవనంబు"** అని ఆచార్యులే స్వయంగా తమ కృతిని గూర్చి తెల్పినారుగదా! దీనిని చదివిన ప్రతివ్యక్తికి ఇది ప్రత్యక్షరసత్యమనే విషయం తేటతెల్లమవుతుంది. అందువల్ల ఈ పద్యం బాగుంది అంటూ ఏదో ఒకపద్యాన్ని ఎత్తి చూపే అవకాశం లేదు.

తొంబది వసంతాల జీవన పథంలో ఎన్ని అనుభవాలో? ఎన్ని ఎత్తుపల్లాలో? ఎన్ని ఒడిదొడుకులో? అన్నిటినీ రంగరించి పద్యరూపంలో మనముందుంచారు ఆచార్యులవారు. **"భక్తవత్సల! మదీయాభీష్టమీడేర్పవే"** అనే శీర్షకంలో లోకం తీరును తూర్పారపట్టే ప్రతిపద్యం ఆణిముత్యమే. అందులో మచ్చుకొక మౌక్తికం–

**"ఒకటియు రెండు పద్దియము లుప్పన చప్పనగా రచించి గొం**
**తుక పగులంగ వాగి తనతోయము వారల తోడుపాటుతో**
**ప్రకటధనావళుల్ గొనెడి వారల నవ్వెద; విద్యలందు వా**
**ణికి మగలై యకించనత నిత్రులు సల్పెడి వారి కేడ్చెదన్."**

ఇది మన అందరి అనుభవం.

అలాగే తిరుమలకు వచ్చే నిజమైన భక్తులను చూస్తే వేంకటేశ్వరుని చూచినట్లే, వారి అనుభవాలు వింటే స్వామిమాట విన్నట్లే అంటూ చెప్పిన భాగవత తత్త్వమిది అత్యంత హృద్యం.

**పదములు కొండ క్రిందికిని భావము మీఁదికి లాగుచుండఁగా**
**వదలఁగలేక నిన్వదలి వచ్చిన త్రోవలనేగు భక్తులన్**
**సదమల చిత్తులం గనుట చక్కఁగ నిన్గనుగొంటయే సుమా!**
**తదుదిత వాక్కులన్ వినుట తావక వాక్కులు వింటయే యగున్.**



అలాగే భగవదారాధన కుపక్రమిస్తూ అనుసంధించే "అమర్యాదః" అనే శ్లోకానికి, అనేక వైష్ణస్తోత్రాలలో ప్రపత్తి పరమైన అనేక శ్లోకాలకు అనువాదాలు మూలాలకే వన్నె తెస్తున్నాయి.

అలాగే **"విష్ణుపత్నినమోఽస్తుతే విశ్వజనని"** అంటూ వర్ణించిన సాంప్రదాయికమైన లక్ష్మీ పురుషకార వైభవం ఈ స్తోత్రాలకు తలమానికం. అమ్మవారి నిత్యానపాయినీత్వాన్ని చాటి చెప్పిన **"మొదట భృగువంశమందు"** అనే గీతపద్యం మౌక్తికాలకే మౌక్తికం.

ఇక అప్రయత్నంగా చోటుచేసుకున్న **"అమృత స్యంది భవత్పదకమల నివేశితమనస్వి" "గరుడగంబము" "పసివాని తొక్కుపలుకులు" "ప్రాణవల్లభుఁ డగు శ్రియఃపతివి"** మొదలైన ప్రయోగాలు పాఠకుల నాలోచింపజేసేవై ఆచార్యులవారి ప్రతిభావ్యుత్పత్తుల కద్దంపడుతున్నాయి.

**"వయసు తొంబదియేండ్లు కావచ్చుఁగాక**
**తన కవన కాంత నిత్యయౌవన నితాంత**
**లలిత సౌందర్య రేఖా విలాసధుర్య**
**అనుటలో ఆవగింజంత అనృతమున్నె"**

అనే మహాసహస్రావధాని మేడసాని వారితో మనమంతా ఏకీభవించవలసిందే.

ఈ రోజుల్లో ఏది వ్రాసినా, ఎలా వ్రాసినా, అర్థమయ్యేదైనా, అర్థం కానిదైనా కవిత్వమే. రాను రాను అర్థవంతమైన కవిత్వమే మృగ్యమయ్యే పరిస్థితి. కవులు కూడా కోకొల్లలు. కాని నిజమైన కవులు వీళ్ళల్లో ఎందరు అంటే కేవలం వేళ్లమీదే లెక్కతేలుతుంది. అట్టి మహాకవుల కోవకు చెందిన పండిత కవులు ఆచార్యులవారు. ఈ రోజు కవులుగా చలామణీ అయ్యేవారూ, కవులు కాగోరేవారూ ఆచార్యులవారి మార్గదర్శనం పొందవలసిన అవసరం ఎంతైనా ఉంది. లేకపోతే పోను పోను తెనుగు కవిత, దాని తియ్యదనం మరుగునపడే ప్రమాదం లేకపోలేదు.

"నీవే తక్క నితః పరం బెరుగ" నంటూ వేంకటేశ్వరునే శరణుజొచ్చి, స్వామిపాదాలవద్ద స్వామికైంకర్యం చేస్తూ జీవితాన్ని సార్థకం చేసుకుంటున్న ఆచార్యులవారు మనకందరికీ ఆదర్శప్రాయులు.

పసలేకపోయినా ఈ పసివాని తొక్కు పలుకులు ఆచార్యులవారిని అలరిస్తాయనే విశ్వసిస్తూ, శ్రీమాన్ కొండమాచార్య స్వామిని ఆయురారోగ్యాదులతో ఆశీర్వదించి తన నిత్యకైంకర్యాన్ని వారికి అనుగ్రహించాలని ఆ ఏడుకొండల స్వామిని ప్రార్థిస్తూ, తప్పులను మన్నించుమని ప్రార్థిస్తూ, ఆచార్యుల వారి సన్నిధిలో సాష్టాంగ ప్రణామాలను సమర్పించుకుంటూ సెలవు తీసుకుంటాను.

తిరుపతి
19-01- 2013

ఇట్లు
విద్వజ్జనవిధేయుడు,

**కందాళ వేంకట రామకృష్ణమాచార్యులు**

# శ్రీనివాస స్తుతి

శ్రీ వేంకటాద్రినిలయః కమలాకాముకః పుమాన్,
అభంగురవిభూతిర్న స్తరంగయతు మంగళమ్.

శ్రీ వేంకటాచలాధీశం శ్రియాఽధ్యాసితవక్షసమ్,
శ్రితచేతనమందారం శ్రీనివాస మహం భజే.

అఖిలభువనజన్మ స్థేమభంగాదిలీలే
వినత వివిధభూతవ్రాత రక్షైకదీక్షే,
శ్రుతిశిరసి విదీప్తే బ్రహ్మణి శ్రీనివాసే
భవతు మమ పరస్మిన్ శేముషీ భక్తిరూపా.

నాన్యం వదామి న శృణోమి న చింతయామి
నాన్యం స్మరామి న భజామి నా చాశ్రయామి,
భక్త్యా త్వదీయచరణాంబుజమంతరేణ
శ్రీ శ్రీనివాస పురుషోత్తమ దేహి దాస్యమ్.

శ్రియః కాంతాయ కల్యాణనిధయే నిధయేఽర్థినామ్,
శ్రీ వేంకటనివాసాయ శ్రీనివాసాయ మంగళమ్.

# నివేదనము

వృషశైలాధిప ఏవ దైవతం నః
వృషభాద్రీశ్వర ఏవ దైవతం నః,
ఫణిశైలాధిప ఏవ దైవతం నః
భగవాన్ వేంకట ఏవ దైవతం నః.

శ్రీ శ్రీనివాసః పరదైవతం నః
శ్రీ శ్రీనివాసః పరమం ధనం నః,
శ్రీ శ్రీనివాసః కులదైవతం నః
శ్రీ శ్రీనివాసః పరమాగతి ర్నః.

వక్త్రాబ్జే భాగ్యలక్ష్మీః కరతలకమలే సర్వదా దానలక్ష్మీః
దోర్దండే వీరలక్ష్మీః హృదయసరసిజే భూతకారుణ్యలక్ష్మీః,
ఖడ్గాగ్రే శౌర్యలక్ష్మీః నిఖిల గుణగణాడంబరే కీర్తిలక్ష్మీః
సర్వాంగే సౌమ్యలక్ష్మీః మయి తు విజయతాం సర్వసామ్రాజ్యలక్ష్మీః.

శ్రీర్వర్చస్వ మాయుష్య మారోగ్య
మావీదాచ్ఛోభమానం మహీయతే,
ధాన్యం ధనం పశుం బహుపుత్రలాభం
శతసంవత్సరం దీర్ఘమాయుః.

– ఋగ్వేద ఖిలభాగం 5-87-23 ఎ



# సమర్పణమ్

శా. స్వామీ! వేంకటనాథ! త్వచ్చరణ కంజాత ద్వయీ సేవనో
ద్దామోన్నిద్రమతిన్; త్వదీయగుణ గాథా వర్ణయ ద్గీతికా
శ్రీమాధ్వీరసపాన విస్మృత శరీరిన్; నాదు మూర్ధమ్మునన్
ప్రేమాశీర్నవ కుంకుమాక్షతలు వర్షింపంగదే మ్రొక్కెదన్. 1

శా. ప్రాతర్భాను మయూఖ హేమరుచులన్ రాకా నిశా వల్లభ
స్ఫీత జ్యోత్స్నికలన్ హసించు భవదక్షి ద్వంద్వ శోభల్ ప్రభూ!
చేతఃప్రీతిగ మాపయిం బఱపి రక్షింపంగదే నీ పదా
బ్జాతంబుల్ మదినమ్మి కొల్చు కొనుటల్ భావించి మమ్మెప్పుడున్. 2

శా. దేవా! తావక చిత్కళాంశమును నర్తింపంగ నీవయ్య మ
ద్భావవ్యోమ తలమ్మునందున జడీభావాంధ తామిస్రముల్
తావుల్ దూలప్రబుద్ధమై హృదయ కల్హారమ్ము చెల్వార, నా
నా విజ్ఞాన పరీమళమ్ముల మహానందమ్ము సంధిల్లఁగన్. 3

మ. కలవారింటను పుట్టనైతిని గదా! కర్పూర నీరాజన
మ్ముల నెత్తంగ; సువర్ణ పుష్పముల సంపూజింప; నెంతేని ను
వ్విళు లూరించెడి పాయసాన్నముల నైవేద్యమ్ము సల్పంగ; కా
ని లసన్మానస పూజసేయుదు దయన్ నిల్పంగదే నాపయిన్. 4

మ. నిను సేవించెడు భక్తు నీ కరణి తండ్రీ! తీవ్ర హృత్తాప త
ప్తుని గావింతువె? లేదు లేదు కినియం బోకయ్య! వాగ్దోష మ
త్యనుకంపార్ద్రమతిన్ క్షమింపుము విమూఢాత్ముండ, బాలుండ; నీ
మనసెట్టో మఱియట్టులే జరుగుతన్ మాకేల దుర్భావనల్. 5

శా. ఛేదింపంగదె మోహవల్లికల; రాశీ భూత పాపాగ్ని కీ
లాదాహమ్మును రూపుమాపఁగదె జాలమ్మేలొకోయింక నీ
వే దిక్కంచు భజించువాఁడ కరుణాదృక్కోణ! నన్నేలుకో
రా! దాసుండ దురంత సంసృతి విషాదాంభోధి నిర్మగ్నుఁడన్. 6

తే. సజ్జనుల మాత్రమేకా దసజ్జనులను
పావనులఁజేయు నీ నామ భజన; పరుస
మది అయో విగ్రహము నేమి వ్యాధుచేతి
కఱకు కత్తిని గూడ బంగరుగ మార్చు. 7

శా. ప్రాకారమ్ములు చుట్టివచ్చుఁ; ద్రుటి మాత్రన్ నిల్వబో దొక్కచో
ఈ కష్టాత్మ; అనుగ్రహింపఁగదె నాయీ చిత్త మేవేళ నీ
శ్రీ కైంకర్యము లందు నిల్చుగతి; తండ్రీ! యింతకున్ మించి యే
యాకాంక్షల్ మఱిలేవు నీ వెఱుఁగవయ్యా! మన్మనస్తత్త్వమున్. 8

మ. కమనీయార్థ సుధానిధానము జగత్కల్యాణ సంధాయి యీ
రమణీయ స్తవనంబు భక్తిరసధారా సంప్లుతాత్ముండనై
తమి నర్పించెద నీకు; చేకొనుము వాత్సల్యంబుతో కంఠహా
రముగా; పండఁగ మామకీన కవితాబ్రాహ్మీ తపమ్మంతయున్. 9

* * *





# నీకు జోహార్లు వెయ్యార్లు నిగమమూల!

క. చిఱునగవు చిందు మోమును
వరదాభయ హస్తములును వనమాలికయున్
కరుణ విరియు కన్నులు గల
తిరుమల నాయకున కిడెద దీవెనకోలుల్. 1

క. మురిపములు మూటగట్టుచు
సిరి యురమున శోభిలంగ శృంగారసుధన్
కరువునఁ బోసిన కైవడి
వరలెడు వైకుంఠుఁ గొలుతు వాలాయముగన్. 2

క. వడలని వాఁకిటి తోరణ
విడుమర లేనట్టి భోగ విభవంబులు సొం
పడర పదార్వన్నె పసిఁడి
గుడిలో నెలకొన్న విభుని కోరి భజింతున్. 3

ఆ. నల్లనైనవాఁడు నామాలు గలవాఁడు
దివ్య వజ్రమకుట దీప్తి వాఁడు
కొండకొమ్ము మీఁద కొలువు దీరిన వాఁడు
మమ్ముఁ బ్రోచుఁ గాత! మాపు రేపు. 4

ఆ. శ్రీనివాసుఁ డంచు దీనబాంధవుఁ డంచు
భక్తసులభుఁ డంచు శక్తుఁ డంచు
విశ్వరూపుఁ డంచు విశ్వమయుం డంచు
వెంటఁ దవిలినాఁడ వేంకటేశ! 5

తే. అడుగడుగు దండముల వాఁడ! ఆదుకొనెడు
వాఁడ! ఆపద మ్రొక్కుల వాఁడ! అంద

గాఁడ! మంగాంబ కౌఁగిటఁ గరఁగు వాఁడ!
నీకు జేజేలు దండాలు నీటుగాఁడ! 6

తే. బ్రహ్మ రుద్రాది సర్వ సుపర్వకోటి
వందిత పదారవింద! గోవింద! సామ
గానలోల! కాంచనచేల! మౌనిపాల!
నీకు జోహార్లు వెయ్యార్లు నిగమమూల! 7

తే. వేంకటేశాయ నమ యంచు వికచకుసుమ
విసరమున నిన్నుఁ బూజించు విమలబుద్ధి,
కుదురుపాటు రవంత చేకూర్ప వయ్య!
శ్రితజనోద్ధరణోల్లాస! చిద్విలాస! 8

ఆ. పాఱువేఁట లన్న పాచిక లన్నను
వడ్డికాసు లన్న వనిత లన్న
నిలువుదోఁపు లన్న నీ కేల వ్యామోహ
మెఱుఁగఁ జెప్ప వయ్య! తిరుపతయ్య! 9

క. కలికాలమ్మున పిలిచిన
పలికెడు దేవుండ వంచు పరిశుద్ధుల, పా
పుల మ్రొక్కు లంది సమముగ
సిలుగులు తొలఁగింతు వంచుఁ జింతింతు నినున్. 10

క. తల నీలపు ముడుపులు గొని
తలబరువులు దింపు వింతదైవతము నినున్
తలఁపు విరిదమ్మి గద్దియ
నిలిపి పడయువాఁడ పరమనిశ్శ్రేయసమున్. 11

క. పిడిచిన జిడజిడ నేతులు
వడిసెడు పొంగళ్ళు, లడ్లు, వడ లుండంగన్



పొడిపొడి బెల్లపు పిండికి
నిడునాలుకఁ జాఁచు నట్టి నిను సేవింతున్. 12

క. నినుఁ గనియెడు కన్గవయే
కనుఁగవ యని; నిముస మీవు కాలిడు మనసే
మనసని మదిలో మఱవక
మనుగడ సాగించుచున్న మ మ్మేలఁగదే! 13

క. కాను సుమి కుక్క కంటెను
హీనుఁడ; నీ దొడ్డ బుద్ధి యింతో అంతో
మానుగ నీదయ నెఱిఁగితిఁ
గాన శరణుఁ జొచ్చినాఁడఁ గాపాడు మయా! 14

క. గోవిందా! గోవిందా!
గోవిందా! యనెడుపల్కు గుఱుతుండు నటుల్
దేవర యనుగ్రహింపం
గావలె నీదాసు సర్వకాలము లందున్. 15

క. బిడ్డల గొడ్డుల దొడ్డుల
దుడ్డుల ని మ్మనుచు నిన్ను తొందఱచేయన్
కడ్డాయమ్ముగ నంటిన
జిడ్డును బాపుకొను వెరవు చెప్పఁగదయ్యా! 16

క. అనుభవమున నున్నవియున్,
కనులారఁగఁ గన్న యవియు, కర్ణమ్ములతో
వినినవియుఁ గలవు తావక
ఘనమహిమలు పెక్కు; పొగడఁగా నాతరమా? 17

తే. నీవు లేవని పలికెడు నీచునాల్క
కఱకు చుఱకత్తి పఱపఱ తఱుగ వలదె?

కొండకును నన్ను రప్పించి కూఁతు జబ్బు
గడియలో మాన్పి పంపితిగద! ముకుంద! 18

తే. నీవు కొండంత యోపిక నిట్టనిలిచి
కరుణ మామొఱ లాలించి కాచిబ్రోవ
కాంచుచుండియు నిను నిరాకారుఁడంచు
నిర్గుణుం డంచు నెటులాడ నేర్తునయ్య! 19

తే. ఎన్నియో తప్పు లొనరించి యెఱుఁగనట్టి
వానిపోలిక మ్రోలకు వచ్చినప్పు
డన్ని యెఱిఁగియు చీకొట్టి యంపకుండ
నాదరించెడు తండ్రి! నీ కంజలింతు. 20

క. పలుపోకలు గల మర్త్యుల
పలుకులు వినకుండ చెవుడు; పాపపుఁబనులన్
తిలకింపకుండ నాంధ్యము
తలకొనినన్ మేలుగాదొ? దైత్యధ్వంసీ! 21

క. నీవే తల్లివి దండ్రివి
నీవే కులదైవతమవు నెచ్చెలి వీవే
నీవే గురుఁడవు విభుఁడవు
నీవే శరణంబు మాకు నీవే వరదా! 22

* * *



# జగములేలు దొరా! నీకు జయము

తే. ప్రాతరారంభవేళల పద్మగర్భ
శివ మహేంద్రాది దేవతాశ్రేణి సలుపు
మేలుకొలుపులకున్ కనుల్ లీల విచ్చి
జగములేలు దొరా ! నీకు జయము జయము. 1

క. కలఁడు కలం డను నాతఁడు
కలఁడో లేఁడో యటంచు గజబుద్ధులు శం
కిలకుండ వేంగడమ్మున
నిలిచిన శ్రీ శ్రీనివాస ! నీకు నమస్సుల్. 2

తే. సంపదలయందు మఱపులు, సంకటముల
మ్రొక్కులు స్వభావమైయున్న యుక్కివులము,
అందినం జుట్టు, పాదము లందకున్నఁ
బట్టుకొను క్షుద్రులము కోపపడకు మయ్య! 3

క. తలఁచిన దలఁపకయున్నన్
గొలిచినఁ గొలువకయయున్నఁ గొద లెంచక నిన్
దలఁచిన కొలిచిన వానిగఁ
దలఁచుచు నన్గావ నీకు దండములు హరీ! 4

క. గుడిగట్టకున్నఁ గట్టిన
గుడిఁ జొచ్చి "నమోఽచ్యుతాయ గుణినే" యని నీ
యడుగుల నొక తులసీదళ
మిడని దరిద్రుండ దోసమెంచకు స్వామీ! 5

క. నీ కృప నేర్చిన నుడుగుల
నీకథలన్ నుడువఁబోక నియమస్థుఁడనై

కాకమ్మకతలు సెప్పితి
చీకొట్టక నన్ను దరికిఁ జేర్చుకొనఁగదే! 6

క. చదివి చెడుచున్న నన్నున్
పదిలముగా మంచిదారిఁ బట్టింపనిచోఁ
దుదకు దయనీయుఁ డెందును
వెదకిన దుర్లభుఁడు నీకు వేంకటరమణా! 7

తే. సంధ్యవార్చి యెన్నొ సమ లాయె తిరుమణి
దిద్ది నుదుట నెన్నొ దినము లరిగె;
జపము తపము లేని జన్మ మియ్యది శాస్త్ర
విధి నతిక్రమించి విఫలుఁడైతి. 8

తే. అరువదేండ్లేగినన్ బహిరంతరంగ
శత్రువుల గెల్వఁజాలని చవట నైతి;
కుడుపు పెట్టిన వానిని, కడుపుగొట్టు
వాని సమబుద్ధిఁ గనుఁగొను జ్ఞాన మిమ్ము. 9

క. చెడఁదిరిగి కొంపఁజేరిన
కొడుకునొడల్ గడిగి కూడుగుడ్డల నిడి ప్రే
ముడి గాంచు జనకుకైవడి
నడజడి దొలఁగించి కరుణ నరయుము తండ్రీ! 10

తే. వడ్డికాసులవాఁడవు వరదుఁడ వని
యెఱిఁగి గురిగింజ యెత్తు బంగరువు నీకుఁ
గాన్కవెట్టక హేమాద్రి గాంక్షసేతు
నింత కృపణుని ననుఁ బ్రోతు వెంత వింత! 11

తే. నేను నాకున్న దంతయు నీకె చెంద
నింక నీ కర్పణము సేయ నేమి గలదు?



నిన్నె శరణమ్ము పొందితి; నీదుబాస
తలఁపునకుఁ దెచ్చుకొమ్ము సీతాకళత్ర! 12

తే. ఆయురారోగ్య విత్తగృహాన్న పాన
వస్త్రతతి వేడలేదు విపత్తి నేని;
తరుణ కిసలయారుణ భవచ్చరణ యుగళి
నంజనగిరీశ! యొసఁగు మనన్యభక్తి. 13

క. కులధన కులదైవతములు
తలిదండ్రులు బంధుజనులు దాతలు త్రాతల్
చెలులు సమస్తము నీ వని
తలఁచిన నీ దాసదాసుఁ దగ నోము మయా ! 14

క. నిరసించినను భవత్పద
సరసిజముల వీడ; జనని చనుగుడుచు శిశున్
నిరసించుఁ గాక కినుకన్,
చరణములన్ బుదుత వీడఁ జాలఁడు గాదే ! 15

క. అమృతస్యంది భవత్పద
కమలనివేశితమనస్వి కాంక్షించునె య
న్యము? మధునిర్భరతామర
సముఁ దుమ్మెద విడిచి గొబ్బి చాయకుఁ జనునే? 16

తే. పరుల తలవాకిట వసించి పనులు చేసి
ప్రస్తుతించి గడించిన బైసి లేదు;
నీకు సల్పు నమస్క్రియ నిఖిలశుభము
లిచ్చు నశుభమ్ము లణఁచునం చిపుడ తెలిసె. 17

క. అగణిత మహిమాస్పదుఁ డగు
భగవంతు నినున్ వృషాద్రిపతిఁ బూజింపన్
పొగడల పొన్నల మీఁదెడు
నిగమాగమ సూక్తి సమితి నే నెట దెత్తున్? 18

సీ. భానుకోటిప్రభా భాసమాన కిరీట
దీధితి పుంజమ్ము తిమిర మణఁప
రాకేందువదన విరాజిత ఘనసార
కస్తూరికా పుండ్ర కాంతు లొప్ప
మకరకుండల నూత్న మాణిక్య రోచులు
గండభాగమ్ముల కళుకు మీఱ
శాతకుంభ దుకూల చారు మౌక్తిక రత్న
హారశోభలు దిక్కులందుఁ బర్వ

తే. శంఖచక్రాసి దీప్తులు చౌకళింప
పాదకటక ద్యుతిచ్ఛటల్ పారుకాడ
సాంగ శృంగార రుచి సమాలింగితాంగ
విభవు నిను మెచ్చ శారదావిభుని తరమె? 19

తే. భవుని గుడిలోన శక్తి దేవళములోనఁ
గార్తికేయు కోవెలలోనఁ గంటి నిన్నె;
నీకు శేషంబు విశ్వంబు; నిఖిలదేవ
తాంతరాత్ముండ వీవె శేషాచలేంద్ర! 20

క. కృతివి కృతజ్ఞుఁడవు దయా
మతివి వదాన్యుఁడవు వశివి మహనీయ దయా
మృతజలధివి గరుడాచల
పతివి జగద్గతివి నీవె ప్రణతార్తిహరా! 21



క. సేనానాథుఁడు విష్వ
క్సేనుఁడు; వాహనము గరుడి; శేషుఁడు తల్పం;
బానందిత సకల భువన
మానిత వైభవుని మెచ్చ మాటలు గలవే? 22

క. పసివాని తొక్కుపలుకులు
విసువక విని యలరు తండ్రివిధమున నాయీ
పసలేని పద్దియమ్ముల
ముసిముసినగవులను వినుచు మోదింపు ప్రభూ! 23

తే. స్వాతిచినుకులకై శుక్తిచందమునను
కాచుకొనియుంటి; కోనేటిగట్టుపొంత
పలుకరింతువొ? గరుడగంబమ్ముచెంత
దర్శన మ్మిత్తొ? పాపిని దయ దలంపు. 24

క. కుక్కమొఱ విన్నవానికి
గ్రక్కున నాశ్రితులఁ బ్రోచు ఘనునకు నీకున్
మ్రొక్కి యిటు విన్నవించితి
దిక్కన్యము నాకు లేదు తిరుమలనాథా! 25

తే. మమ్ముఁ గన్నమ్మ అలమేలుమంగతోడఁ
జల్లఁగా నెల్లకాలము సకలభోగ
భాగ్యములతోడ వర్ధిల్లి భక్తకోటి
నిండుదయ నేలు తిరుమలకొండరెడ్డి! 26

సీ. అంజలి యిదె నీకు నఖిలాండనాయక!
వందన మ్మిదె మౌనివంద్య! నీకు
ప్రణిపాత మిదె నీకు భక్తకల్పద్రుమ?
కేలుమో డ్పిదె కృపాశీల ! నీకు

ప్రణతి యిదే నీకు పతితపావననామ!
జోహారిదే సర్వసులభ ! నీకు
కైవార మిదె నీకు కైవల్యదాయక !
దండ మిదే శుభదాయి! నీకు

తే. జోత లివె నీకు భువనవిఖ్యాతచరిత!
మ్రొక్కు లివె ముగ్ధమోహనమూర్తి! నీకు
చాఁగిలింత లివే దేవసార్వభౌమ !
ఏటికో ళ్ళివె శ్రీ వేంకటేశ ! నీకు. 27

* * *



# భక్తవత్సల! మదీయాభీష్ట మీడేర్పవే!

మ. జయ గోవింద ముకుంద కేశవ హరే శౌరే మురారే రమా
ప్రియ నారాయణ శంఖచక్రధర గోపీనాథ సద్భక్తసం
చయసంరక్ష విపక్షశిక్ష సరసీజాతాక్ష స్వామిన్ భవ
జ్జయమే నా జయమంచు నెంచెదనయా! సప్తాచలాధీశ్వరా! 1

ఉ. తూరుపుఁగొండపై నినుఁడు తోఁపకమున్న పురందరాది బృం
దారకబృంద పూజలు సదా గొను ని న్నరవిందలోచనున్
బారెఁడుప్రొద్దుచన్న శయనమ్ము త్యజించి భజింపఁ డీ దురా
చారుఁడు వీని కేమి మది సల్పఁగ నెంచితొ వేంకటేశ్వరా! 2

మ. ఫలమో పత్రమొ పుష్పమో జలమొ సద్భక్తిన్ సమర్పింప ని
ర్మలకారుణ్యమనస్కతం గొనెదు; మత్ప్రారబ్ధ మేమందు? ని
చ్చలు నీ పూజ లొనర్ప; త్వచ్చరణకంజధ్యానముం జల్ప; నీ
యలఘుస్తోత్రము లాలకింప నెటు లప్పా! నన్ను మన్నించెదో! 3

ఉ. కూటికి గుడ్డకున్ కొదవ గూరెను పుట్టిననాటఁగోలె ఈ
పాటున కర్థమేమొ తలపండినప్రాయమునందుఁ గూడ ఏ
పూఁటఁ దలంప; మత్కలుషపుంజము గీటడగించి కావఁగా
నోటికి నామమున్నదని నూల్కొననైతిఁ గదయ్య! మాధవా! 4

ఉ. చావఁగనున్నవానికిని చావదు పాడుధనాశ; బూదియున్
కావులు దాల్చువానికిని కావర మెత్తగఁ జేయు; దయ్యమై
రేవగ లేడిపించు; మతి లేవడి మేలనిపించె; శాంతితో
జీవితమెల్లఁ బుచ్చితిని చీకులు చింతలు లేక శ్రీహరీ! 5

మ. పరమైకాంతికభక్తకోటికథ లే భంగిం బ్రవర్తిల్లెనో
మఱి మన్మానసవృత్తి, నీయెడల నస్మత్సేవ యేపాటిదో
యెఱుఁగంజాలనె? యెగ్గుసిగ్గువిడి నాయిష్టమ్ము లీడేర్పఁగాఁ
బరిపీడించెద నిన్ను; సైఁపఁగదవే పద్మావతీవల్లభా ! 6

ఉ. తోఁటలు దొడ్డు లిమ్మనుచుఁ దొందఱపెట్టితి; గొడ్లు బిడ్డలున్
పేటలు కోట లిమ్మనుచు వేఁడితి; నీ చరణాంబుజద్వయిన్
గాటపుబత్తి నిమ్మనుచు గట్టిగ వేఁడితినా మహాప్రభూ !
మాటలు వేయునేల కొఱమాలినకోర్కుల నేమి చేకుఱెన్? 7

మ. ఒకఁడేదో యపకారముం జలుపఁగా నుంకించినాఁ డంచు, వే
ఱొకఁ డేమేమియొ తూలనాడెనను చిట్లుల్లంబులో ప్రగ్గెదన్;
సకలంబున్ భవదాజ్ఞచే నడచునన్ సత్యంబు గుర్తింప; బో
ధకళన్ మాపవె కైటభాంతక! మదంతశ్శత్రుతామిస్రమున్. 8

మ. అతఁడాచారవిహీనుఁ డీతఁడు కఠోరాత్ముండు లుబ్ధుం డితం
డతఁ డజ్ఞాని యహంయు వీతఁడని నిత్యం బన్యదోషంబులన్
ధృతిమై చాటెద; నాదుదుర్గుణము లీరీతిం జెలంగన్ గృపా
మతి నే రీతిని బ్రోతువో యెఱుఁగ శ్రీమద్వేంకటాద్రీశ్వరా! 9

చ. ఒకటియొ రెండొ పద్దియము లుప్పన చప్పనగా రచించి గొం
తుక పగులంగ వాగి తన తోయమువారల తోడుపాటుతో
ప్రకటధనావళుల్ గొనెడివారల నవ్వెద; విద్యలందు వా
ణికి మగలై యకించనత నిత్రులుసల్పెడివారి కేడ్చెదన్. 10

ఉ. ఈ కాలం బెపు డిట్టులుండునె? జగం బీ కైవడిన్ సాగునే?
నాకీవ్యర్థవిచార మేల? సకలాంతర్వర్తి వీ వౌటచే
లోకంబెల్ల భవత్స్వరూపముగ నాలోకించు సద్బుద్ధినే
శ్రీకాంతాకుచకుంకుమాంకితవపుశ్శ్రీకా! ప్రసాదింపవే! 11



ఉ. పుట్టితిఁ; బెండ్లియాడితిని; బొట్టెలఁ గాంచితి; పొట్టకోసమై
వెట్టి యొనర్చుచుంటి; నఱవీసము సౌఖ్యము శాంతి గంటినే
కట్టిఁడి కాఁపురమ్మున? నఖండభవత్పదభక్తిలేనివాఁ
డెట్టి విపశ్చితుం డయిన నేమిఫలంబు? వృషాద్రినాయకా! 12

శా. గీతాశాస్త్రము వల్లెవేసినను భక్తి జ్ఞాన వైరాగ్యముల్
చేతుల్ ద్రిప్పుచు బోధచేసినను సుశ్రేయంబు సిద్ధించునే?
గోతుల్ ద్రవ్వెడు క్రూరకర్మునకు? నీకుం గిన్కపుట్టించునో
యేతప్పుల్ – మఱి వానిఁ జేయనటు తండ్రీ! నన్ను శిక్షింపవే? 13

మ. ద్వయ మష్టాక్షరి పైతృకంబయిన విత్తం; బన్యధర్మాల యా
శ్రయమేలా? దురితౌఘముం దొలఁచి సంరక్షింప దివ్య ప్రప
త్తి యెసంగన్ భయమేల? నీ వొకఁడవే దిక్కంచు నీ భక్తి నా
వయె తీరంబును జేర్చునంచు మది సంభావించి సేవించెదన్. 14

మ. కలికాలం బిది; శాంతిసౌఖ్యములకున్ కాలంబుగా దిద్ది; బొం
కులు అంకుల్ గృహదాహముల్ గలబలున్ కొట్లాటలున్ దోఁపిడుల్
తెలుపన్ శక్యమె? దీనమానవులకున్ దిక్కెవ్వరయ్యా! వృషా
చలవాసా! అభయప్రదుండవని విశ్వాసమ్ముతోఁ గొల్చెదన్. 15

మ. ప్రతిమన్ గొల్చుట వట్టిదండుగ; 'అహం బ్రహ్మాస్మి' ముఖ్యోక్తులన్
మతిఁ జర్చింపుఁడు; మాయ వీడుఁ డనుచున్ మాయావులౌ జోగు లీ
క్షితిలో నూరి కొకండుగా వెలసి యాస్తిక్యమ్ము కూలార్పఁగా
జతనంబుం బొనరింత్రు; వారి నెపుడున్ శాసింపవే యచ్యుతా! 16

ఉ. దైవతవిగ్రహావళుల దారుశిలాదికబుద్ధులైన యీ
జీవులు సంప్రదాయమును చిన్న మెఱుంగ కవైదికంబులౌ

భావము లేవొ క్రక్కి పదిపావులు చేతుల వేసికొంండ్రుగా
కేవగ ముక్తి గాంతురు మఱెన్నిభవమ్ములకేని కేశవా! 17

చ. కులమతజాతివర్గములకున్ బలిగాక మెలంగు పుణ్యచి
త్తులు హరిదాసులౌ బుధులతో సహవాసము; వారి ధర్మబో
ధలు విను భాగ్య మీఁగదవె! దంభము దర్పము క్రోధముఖ్య దు
ర్విలసన మెల్ల మాపఁగదవే! భువనైకగతీ! రమాపతీ! 18

చ. కలియుగదైవతం బనుచు కామితదాయకుఁ డంచు సత్కృపా
జలనిధి వంచు నీ సుగుణజాలము మెచ్చుచు నీమనోజ్ఞమం
గళమహనీయవిగ్రహము కన్నులఁ గాంచుచు నీ మహత్త్వముం
దలఁచుచు నీదుభక్తులు ముదంబును జెందెదరో జనార్దనా! 19

చ. అలజడు లట్టె తమ్మలమినప్పుడు "త్వాం శరణం ప్రజామి మా
మలఘు దయా సుధామయ ధియా పరిపాహి హరే" యటంచు ని
శ్చల మగుభక్తి వేఁడఁగనె చయ్యన ఓయను చేగుదెంచి భ
క్తుల కడగండ్లు మాన్పు నిను కోరిభజించెద భూమనోహరా! 20

మ. గుడిలో నీ సముఖమ్మునన్ నిలిచి దృక్కుల్ రెండు సొంపారు నీ
యడుగుందామరలందుఁ జేరుచుటయే యాలస్య; మీ చిత్త మె
క్కడకున్ బిచ్చము నెత్తఁ బోవునొ యెఱుంగన్ రాదు; డాకాలితో
పడఁదన్నుంగదవయ్య! సిగ్గు జనియింపన్ దారికిన్ వచ్చునో? 21

చ. కట్టెలఁబెట్టి కాల్చినను కామము బూడిద బుగ్గిగాక యే
పట్టుననేని వీడ కిటు బాధలు పెట్టఁగ దీనిధాకకున్
తట్టుకొనంగలేక సురతాపసవందిత! నీ పదాబ్జముల్
గట్టిగ పట్టుకొంటి ననుఁ గ్రన్నన మన్ననసేసి కావవే! 22



ఉ. కరముల శంఖచక్రములు కంఠమునందు సువర్ణహారముల్
శిరమున రత్నశోభితకిరీటము మోమున పుండ్రకమ్ము భా
స్కరశతకోటితేజమునఁ గ్రాలుచు మన్మథమన్మథుండవై
వఱలెడు శ్రీనివాస! నిను వారము వారము చూడఁగోరెదన్. 23

ఉ. రూఢిగ నీ వత్పృష్ట్యమృతరూపుఁడవే; సముఖంబుఁ జేరఁగా
గాఢసమాధి గల్గు; నినుఁ గన్నులఁ జూచియుఁ జూడ నట్టులే
బాధముదంబుతోడ గుడివాకిలి వీడిన యంతలోన ని
ర్వ్యాధ మమత్వ ముప్పతిలి ఉయ్యేలయై మన మూఁగులాడెడిన్. 24

చ. పదములు కొండక్రిందికిని భావము మీఁదికి లాగుచుండఁగా
వదలఁగలేక నిన్ వదలి వచ్చినత్రోవల నేగు భక్తులన్
సదమలచిత్తులం గనుట చక్కఁగ ని న్గనుగొంటయే సుమా!
తదుదితవాక్కులన్ వినుట తావకవాక్కులు వింటయే యగున్. 25

మ. అలమేల్మంగనుఁ బెండ్లియాడితివి; నెయ్యమ్మార మమ్మెల్ల బి
డ్డలుగాఁ గంటివి; భుక్తిముక్తు లొసఁగన్ డంబైన శ్రీ వేంకటా
చలవాసంబును స్వీకరించితివి; విశ్వంబందు నీసాటి వే
ల్పులు లేరంచు పురాణముల్ దెలుప కేల్జోడించి కీర్తించితిన్. 26

మ. నిను నే నమ్మినయట్లు నాసతినిగానీ కూఁతులంగాని నా
తనయుంగాని యొకింత నమ్మను; భుజాదండంబు సారించి యొ
డ్డునకుం జేర్చిరె యేటమున్గిన తఱిన్; డోలోత్సవశ్రీలలో
ననుఁ దేలించితి; నీదునామమహిమన్ వర్ణింపఁగా శక్యమే? 27

మ. నలువన్ గాంచినవాఁడు భూభువనజన్మ స్థేమ భంగాది లీ
లలు గావించెడువాఁడు భక్తజనులన్ లాలించి పాలించువాఁ

దల వేదాంతములందు వర్ణితుఁడు బ్రహ్మం బెవ్వఁడా శ్రీనివా
సులు కారుణ్యకటాక్షదృక్కుల మమున్ చొక్కంబుగాఁ జూచుతన్. 28

శా. నీకైంకర్యము నాకు చేపడునటుల్, నీ భృత్యభృత్యుండనై
నీకొండన్ దరిసించుచుండెదు నటుల్, నీనామసంకీర్తనల్
నాకాంతాతనయాళిఁ గూడి పరమానందంబుతో సల్పున
ట్లాకాంక్షించెద, భక్తవత్సల! మదీయాభీష్ట మీడేర్పవే! 29

* * *



# వేంకటాద్రి విభుని వేడ్కఁదలఁతు

తే. అమృతకలశాతపత్ర వజ్రాంకుశ ధ్వ
జాబ్జ కల్పక శంఖచక్రాంకితమ్ము
సకలశుభదాయి వృషగిరిసార్వభౌము
నంఘ్రిపంకేరుహద్వయి నాశ్రయింతు. 1

తే. సర్వభూమండలమ్ము సాచలకులమ్ము
నేకపాదమ్ముతోఁ గొల్చి యెసక మెసఁగు
శ్రీమహావిష్ణుచరణరాజీవయుగళిఁ
బరమభక్తి నజస్రంబు ప్రస్తుతింతు. 2

ఆ. వేదశిరములందు నాదు మూర్ధమునందు
నెసఁగు నెద్ది కోర్కు లొసఁగు నెద్ది
కులధనమ్ము మాకు కులదైవతము వేంక
టేశుపాదయుగము నెపుడు గొలుతు. 3

తే. చిత్ర చిదచిద్విభాగ విశిష్ట విశ్వ
మతని యయుత శతాంశ కలాంశ కాంశ
మం దెసఁగు; నా ముకుందు పద్మాయతాక్షు
పరమసత్త్వాశ్రయున్ రమాపతి భజింతు. 4

తే. బ్రహ్మహత్యాఘముం బాపి భర్గు నెవఁడు
కాచె; నెవ్వనిపాదోదకము శివుండు
తల ధరించి పవిత్రుఁడై వెలసె; నతని
పరమపురుషు వృషాద్రిమందిరు నమింతు. 5

ఆ. ఎవనినాభినుండి యీ విశ్వ ముదయించు
నెవనిగర్భమందు నిమిడియుండు

నెవఁడు దీనిఁ బ్రోచు నెవనియం దిది డిందు
వాని శేషశైలవాసు నెంతు. 6

ఆ. పుండరీకములను బోలు కన్నులవాని
వెడఁద యెడఁద లచ్చి వెలయువాని
మంచిమనసువాని మాట లూఁకొనువాని
వేంకటాద్రివిభుని వేడ్కఁ దలఁతు. 7

తే. ఎవని మహిమాబ్ధిశీకరాణువును గొలువ
కమలజభవాదులకును శక్యమ్ము గాదొ?
ఆ శ్రియఃపతి మహిమల నభినుతింపఁ
దలఁచుచుంటి నే నెంత? నా తెలివి యెంత? 8

క. కులగిరులె మహార్ణవమునఁ
దల మొల గనరాక యణఁగి తలముంజేరన్
తలపోయఁగ నణుమాత్రుఁడఁ
బలుకఁగలనె నిన్నుగూర్చి పద్మదళాక్షా! 9

తే. స్వామి! నీకృప లేకున్న జగము లెట్లు
పొడమును? ప్రవృత్తిచందంబు నుడువనేల?
సర్వజీవులకు నిసర్గసఖుఁడవైన
నీకు శ్రితవత్సలత్వంబు నిజగుణంబు. 10

తే. వైదికుఁడు సమ్మతింపనివాఁ డెవండు
నీదు స్వామిత్వమున్? నీరజోదరుండు
శర్వ శతమఖముఖు లహిశైలనాథ!
నీ మహామహిమాంబుధి నీటిబొట్లు. 11

తే. శీలరూపచరిత్రలచే ప్రకృష్ట
సత్త్వగుణముచే ప్రబలశాస్త్రములచేత



దైవ పరమార్థవిదుల మతాలచేత
నాసురప్రకృతులు శౌరి నరయ లేరు. 12

తే. దేశకాలాపరిచ్ఛిన్న దివ్యమహిమ
హరికి సముఁ, డధికుండు లేఁ డను నిజంబు
గుణమయి తదీయమాయ దాఁటిన మహాత్ము
లెందు తదనన్యభావులే యెఱుఁగఁ గలరు. 13

ఆ. ధర్మనిష్ఠలేదు; తావక పదభక్తి
లే; దకించనుండ; లేదు నాకు
వేఱుగతియు; నాత్మ వేదినిగాను నీ
చరణసరసిజములె శరణ మగుత! 14

తే. నేను పలుమారు సల్పని నింద్యమైన
కర్మములు లోకమున లేవు కలుషమతిని;
తద్విపాకావసరమున దండఁజేరి
యగతికుఁడ నేడ్చుచుంటి నన్నరయు మయ్య! 15

క. చిరకాలమునకు భవసా
గరనిర్మగ్నునకు నొడ్డుకైవడి నాకున్
దొరకితివి; నేఁడు నీకును
పరమకృపారససమర్హ పాత్రము దొరకెన్. 16

తే. పూర్వ మనుభవింపనిది, మున్ముందు ననుభ
వింపవలసిన యార్తి సహింపఁ గలను;
సహజ మది నాకు; శరణన్నజనులఁ ద్రోపు
సేయు టిది నీకుఁ దగినట్టి చేఁతగాదు. 17

తే. పావన భవత్పదాంబుజద్వంద్వ సతత
పరమభక్తి సుధాబ్ధిశీకర ముదీర్ణ
భవదవానల కీలికాపటలి నార్పి
క్షణములో పరనిర్వృతి సంతరించు. 18

ఉ. స్వాంతము పొంగ కన్గవకుఁ బండువుగాఁగ ప్రభూ! విలాసవి
క్రాంత పరావరాలయము, బ్రహ్మముఖామర పూజితంబు దు
ర్దాంతదురంతదుఃఖములఁ గ్రన్నన మాన్పుచు భక్తపాళికిన్
సంతస మిచ్చు నీ చరణసారసమున్ దరిసించు టెన్నఁడో ! 19

సీ. వికచాతసీసూన విమలచ్ఛవుల నీను
తనువున పీతవస్త్రంబు దాల్చి
జ్యాకిణ కర్కశాజాను విలంబి బా
హులు నాలుగింటితోఁ బొలుపుమీఱి
మణికిరీటాంగద మకరకుండలహార
కాంచికా కటకాది కాంతి మించి
శంఖ చక్ర గదాసి శార్ఙ్గమ్ములన్ తుల
సీవనమాలికఁ జెలువు మెఱసి

తే. నిత్యయౌవన లావణ్య నిరుపమాన
పరమసౌందర్య మహిత రూపమ్ముతోడ
శ్రితుల రక్షింప వేంకట శిఖరినున్న
యిందిరాజీవితేశు ని న్నెపుడు గందు ? 20

సీ. నీ బాహుమధ్య మే నెలఁతకు భవన; మే
వెలఁదిపుట్టిల్లు నీ ప్రియగృహంబు;
యదపాంగసంశ్రయం బఖిలప్రపంచ; మే
చెలికొఱ కంభోధి చిలుకఁబడియె;



సేతునిర్మాణ మే నాతికై జరిగె; నే
యతివ నీ కుద్ది రూపాదులందు
ఆ రమారమణితో నల వికుంఠమునందు
శేషతల్పమున వసించు నిన్ను

తే. నిత్యసూరిసంసేవ్యుని నీరజాక్షు
శ్రితజనైకజీవితుని లక్ష్మికిని లక్ష్మి
యైనవాని మత్సేవల హర్షమందఁ
జేయుభాగ్య మదెప్పుడో శ్రీనివాస ! 21

చ. ధ్వజమయి వాహనమ్మయి వితానమునై మఱి యాసనమ్మునై
వ్యజనమునై సఖుండునయి బంటయి వేదమయుండు తార్క్ష్యుఁడా
ద్విజకులనాథుఁ డే ఘనుని వేడుక మ్రోల వసించి కొల్చు నా
త్రిజగదభీష్టదాయకు హరిన్ నిను భక్తి భజించు టెప్పుడో! 22

సీ. శ్రీవత్సలాంఛనాంచిత పీనవక్షుండు
వికసితాంబుజ చారు వీక్షణుండు
విభ్రమభ్రూలతా విలసనుండు నిమగ్న
నాభి సమున్నతనాసికుండు
మృదుకపోలతలుండు వదనశోభాజిత
పూర్ణామృతాంశుబింబుఁడు శుచిస్మి
తుండు కేసరిమధ్యముండు లలాటప
ర్యంతవిలంబి నీలాలకుండు

తే. కల్పశాఖాభుజుఁడు కంబుకంధరుండు
భక్తజనపారిజాత మాపత్సఖుండు
వాసుదేవుండు శేషాద్రివల్లభుండు
కనులముం దెప్పుడును నిల్చి కాచుఁగాత ! 23

తే. పితవు మాతవు సుతుఁడవు ప్రియసఖుఁడవు
గురుఁడవున్ గతి వీవె లోకులకు; నీదు
పరిజనుండ భృత్యుండ ప్రపత్తిపరుఁడ
నను భరింపక తప్పదు నాథ! నీకు. 24

చ. మనమున నీదుచింత యణుమాత్రము లేదుగదా! రజస్తమో
గుణకలితుండ; వెండియు నకుంఠిత భక్తునిపోల్కి నీ విధ
మ్మున నొక ఛద్మసంస్తవనమున్ విరచించెద; దీని నూతఁగాఁ
గొని సకలజ్ఞ! యీ ఖలుని కుత్సితబుద్ధిని చక్కదిద్దుమా! 25

చ. ప్రణతుఁ డటంచు దుష్కలుషవాయసరాక్షసు సత్కృపామతిన్
మనిచితి; మూఁడుజన్మముల మాటికి నీయెడఁ బెక్కుతప్పులన్
బనివడి సల్పినట్టి శిశుపాలున కిచ్చితి ముక్తి; నీ క్షమా
గుణమునకెం దనర్హమగు ఘోరమహోఘ మదేమొ తెల్పుమా? 26

తే. ఆత్మవంతులు త్వచ్చరణారవింద
పరమభక్తిసంయుతులు ప్రపన్నులైన
నాదు పితరులఁ గనుఁగొని నాదు వృత్త
మెడఁద నెంచక రక్షింపుమీ యుపేంద్ర! 27

తే. అపరిహార్య మనాది దురంతమైన
పాపమున కాస్పదుఁడ నరపశువ నయ్యు
దేవదేవ! దయాసింధు! దీనబంధు!
నీ గుణము లెంచి విడిచితి నిందుభయము. 28

తే. దేవ! యవివేకజలదాంధదిఙ్ముఖంబు
దుఃఖరసవర్షి సంసారదుర్దినంబు
నందు మార్గస్ఖలితుఁడైన మదు నన్నుఁ
గరుణ విరిసెడు కందోయి నరయు మయ్య! 29



తే. స్థిరముగా నాకు నీకున్న శేషశేషి
భావ మెటు తెల్పినాఁడవొ పరఁగ నట్లె
భవ దనన్యభోగ్యమ్ము సద్భక్తి నాకు
శేషభూభృన్మణీ! దయసేయు మయ్య! 30

తే. యోగివర్యాగ్రగణ్యులై యొప్పు విధి శి
వాదులకుఁ గూడ ధ్యానగమ్యంబుగాని
నీదుదాస్యంబు వాంఛింతు నిర్భయుండ
నశుచి నవినీతుఁడ నలజ్జుఁ డయ్య! నేను. 31

తే. భుక్తి ముక్తుల నెవరు నీభువనమోహ
నాకృతివిలోకనాశఁ దృణీకరింతు;
రెవరివిరహంబు దుస్సహం బవునొ నీకు
నా మహాత్ములకొలువు నా కబ్బుఁగాత! 32

చ. భువిలో తావకదాస్యవృత్తికి బహిర్భూతంబులౌ మేను, ప్రా
ణవితానంబు, సుఖంబు, నాత్మ మతి యన్యంబైన దారాదికం
బివి నాకేటికి నీకుఁ గానివి? క్షణం బీపాదుసంబంధ మో
రువఁజాలన్; శతధా వినాశ మవుతన్ రుద్రేంద్రసంపూజితా! 33

చ. స్మరవివశుండ క్షుద్రుఁడ నృశంసుఁడఁ జంచలబుద్ధి వంచనా
పరుఁడ నసూయతో నుడుకువాఁడఁ గృతఘ్నుఁడ గర్వి పాపి నే
సరణి నపారదుఃఖభయసాగరముం దరియించి నీ పదాం
బురుహసపర్య సల్పుదును? పుణ్యవృషాచల శేఖర ప్రభూ! 34

గీ. నేను పరమార్థకామినై నిన్ను భక్తి
నాశ్రయించితి; నన్ను దాసానుదాసుఁ

దనుచు నీ వాదరించి; తన్యోన్యమైన
మన సుసంబంధ మిట్లె పెంపెనయుఁగాక! 35

గీ. మున్నిటి దశావతారాదిభిన్నరీతి
పొడమితివి పుట్టనుండి మమ్ములఁ గృతార్థ
జన్ములను జేయ వేంకటస్వామి! నీదు
మధుర మంగళమూర్తికి మంగళమ్ము. 36

* * *



# ఆత్మనివేదనమ్

మ. అరవిందాసన శంకర ప్రభృతి దేవానీక మేదేవు శ్రీ
చరణాంభోజయుగమ్ము భక్తిభరితస్వాంతమ్ములం గొల్చి హ
ర్షరసాంభోనిధి దొప్పదోఁగెదరొ ఆ సప్తాచలస్వామి స
త్కరుణాదృక్ప్రసరమ్ము మామకమనస్తాపమ్ము పోకార్చుతన్. 1

ఉ. కొండకుఁ జేరి కాలినడ కొండిక కొండయ కండదండగా
నుండుమటంచు కన్నతలి యొప్పుగ నిన్నెటు వేఁడుకొన్నదో
కొండలరాయ! నీ గుడులు గోపురముల్ దరిసించు భాగ్యమున్
మెండుగ నా కొసంగితివి మెచ్చుఁగ నీ కృప నాకు శక్యమే? 2

క. కనుమూసిన కనుదెఱచిన
ననయము నీ రూపు మెదలునట్లుగ మదిలో
కనికరము నెఱపి కావుము
నను నీ భృత్యానుభృత్యు నళినదళాక్షా! 3

క. అన్నియు నీ కిచ్చితి నే
నన్నాడవు; నాకు నిడని యట్టిది మోక్షం
బున్నదిగద! పెరవేల్పుల
కెన్నండిడ తరముగాని దేమందు వయా! 4

తే. అలవియెఱుగక బాలకుం డడిగినట్టు
లడుగ సాయుజ్యపదవి నా కిడుమటంచు;
చీమగా దోమగా జన్మ చేకురినను
స్మృతిపథంబున నిలువుమీ శ్రీనివాస! 5

* * *

# భక్తిన్ సంప్రసాదింపవే!

ච. పిలిచిన వెంటనే పలుకు వేలుపు, భక్తి భజించువారి కో
ర్కులు నెరవేర్చు దైవతము కొండలరాయఁడు దక్క అన్యులీ
కలియుగమందు లేరనుచు గాఢముగా మది నమ్మి నిత్యమున్
కొలిచెడి వారలన్ ప్రభువు కూరిమితో కడతేర్చ కుండునే? 1

మ. తనవేషంబు ధరించినట్టి నటు నాంధ్ర క్ష్మాస్థలీ ముఖ్యమం
త్రినిజేసెన్; నిజనామ ధారులను సల్పెన్ పెక్కురన్ భారతీ
స్తనయుగ్మ ప్రతిమాన రమ్య కవితా సంగీత సామ్రాజ్య భూ
షణులన్; సప్త ధరాధరేశ్వరుని వాత్సల్యంబు సామాన్యమే? 2

శా. నీ సేవాపరులైన వారలకు నెంతే ప్రీతి నీ విచ్చు నా
యా సంపద్విభవమ్ములన్ పొగడ శక్యంబౌనె? నీ మీది వి
శ్వాసంబేకద జంతు సంతతికి నాశ్వాసంబు చేకూర్చు; ల
క్ష్మీ సంసేవిత తావకీన పదరాజీవమ్ము లర్చించెదన్. 3

ఉ. కూటికి గుడ్డకున్ కొదువ గూరఁగ చెల్లని కాసు నన్ను నీ
గూటికిఁజేర్చి ని న్గొలుచు కోవిద కుంజరకోటిమధ్యలో
పీటనువేసి నీవు తిను బెల్లపు పొంగలి పెట్టి మంచి; తీ
గాటపు ప్రేమ వేరొకట గాంతునె యెన్ని భవాలకేనియున్? 4

శా. శ్రీవైకుంఠము వేంకటాచలము; లక్ష్మీజాని వెంకప్పగా
ఆవిర్భూతుఁడు; భుక్తిముక్తు లిడు దివ్యక్షేత్రమౌ తిర్మలన్
భావింపందగు తిర్పతిన్ విడిచిపో స్వాంతంబు క్షోభింపదే?
దేవా! శేషగిరీశ! నీదు పదభక్తిన్ సంప్రసాదింపవే! 5

* * *



# దీనుని కావుమురా! పరాత్పరా!

మ. ఫణిశైలాధిపుఁ డీతఁడే కలియుగ ప్రత్యక్ష దైవంబు; మా
కును మా పూర్వజు లెల్లవారలకు నీగోవిందుఁడే ప్రాణమై,
ధనమై, దిక్కయి యున్నవాఁడు జగదాధారుండు శ్రీ శ్రీనివా
సుని నిర్వ్యాజ కృపామృతార్ద్ర శుభదృష్టుల్ మమ్ము రక్షించుతన్. 1

చ. సకల జగమ్ములందు వృషశైల నివాసుని వంటి దైవతం
బొకరుఁడు లేఁడు లేఁ డనుచు నుల్లము నందున విశ్వసించి తా
వక చరణాంబుజాతముల బాల్యమునుండి భజించు చుంటిరా!
తికమక పెట్టకుండ నను దీనుని గావుమురా! పరాత్పరా!. 2

మ. ఒకదేశాధిపు నాశ్రయించిన నతం డూళ్ళిచ్చు, డబ్బిచ్చు; ఐ
హిక సౌఖ్యంబుల నెల్ల నీయఁగలఁడే? యిల్లాలికిన్ గొడ్డురా
లికి బిడ్డన్ దయసేయఁగాఁ గలఁడె? తండ్రీ! శేషశైలేశ! మా
నక భక్తి న్నుతియింతు నిన్నిహపరానందైక సంధాయకున్. 3

శా. నీ కంఠధ్వని యెట్టిదో తెలియఁగా, నీమాట లెట్లుండునో
ఆకర్ణింపఁగ కోర్కియౌ; జపతపో ధ్యానాది సత్కర్మలన్
గా కెట్లయ్యది చేకుఱున్? జడుఁడ, నజ్ఞానిన్, భవద్దాసుఁడన్
నాకీ జన్మజరాది దుఃఖములు మాన్పన్ నిన్ను కొండాడెదన్. 4

మ. కలలన్ ఘాతుకజంతుసంతతులు దక్కన్ గోవులున్, గోవృష
మ్ములు భద్రేభములున్ కనంబడవు; మత్పూర్వాఘ మేపాటిదో!
ఇల దుస్స్వప్న ఫలంబు లొక్కటియు మాకీకుంటకై నిన్నె శ్రీ
లలనాచిత్తచకోరచంద్రముని వాలాయంబు ప్రార్థించెదన్. 5

శా. స్వామీ! తిర్మల వీథులందు గరుడ స్కంధాధి రూఢుండవై
వ్యోమంబంటఁగ వేదవాద్య నినదం; బూరేగు నా దృశ్యముల్
క్షేమ స్థైర్య జయాయు రున్నత యశశ్శ్రీ లెల్ల సంధిల్లఁగా
మా మోమందున వ్రేలు నట్టివరమున్ మాకున్ ప్రసాదింపవే! 6

చ. తిరుమల మాడవీథులను దివ్యరథస్థుఁడవై సురాంగనా
సురుచిరనాట్యముల్ సెలఁగ; చొప్పడ కిన్నరగానవైఖరుల్
పరువడి సంచరించెడి శుభంకరదృశ్యము మా మనమ్ములన్
మెఱయు వర మ్మొసంగవె అమేయకృపాకర! వేంకటేశ్వరా! 7

మ. తనుభేదమ్ముల శయ్యగా, గొడుగుగా, ధామమ్ముగా, దిండుగా,
ఘనపీఠమ్ముగ, పాదుకా ద్వయముగా, కౌశేయవస్త్రమ్ముగా
నిను సేవించెడు శేషభోగిపయి నెంతే వేడ్క నూరేగు నీ
కనయంబున్ జయమంగళం బగుత దేవా! వేంకటాద్రీశ్వరా! 8

ఉ. అంజన నిన్నుఁ గొల్చి కనినట్టి మహాత్ముఁడు నీకు భృత్యుఁడై
ప్రాంజలి యౌచు నీదుగుడివాకిలి ముందర కాచుకొన్న మృ
త్యుంజయుఁడైన యా హనుమ దోర్యుగ పీఠముపై వెలుంగు నీ
కంజలి చేసి కప్పురపు టారతి నిత్తు త్రిలోకనాయకా! 9

ఉ. నీ తనయుండు బ్రహ్మ పయనించెడి వాహనమైన హంసపై
ప్రీతి దలిర్ప నెక్కి విహరింపఁగ తిర్మలవీథులన్ నినున్
భూతలమందు మానవులు వ్యోమతలంబున దేవ సంఘముల్
చేతము లుల్లసిల్లఁ గని శేషగిరీంద్ర! నుతింతు రెంతయున్. 10

చ. చెరియొక వంక భూసతియు శ్రీసతి యొప్ప ననర్ఘభూషణాం
బరధరుఁడై జగద్విభుఁడు బంగరుటుయ్యేల లోన నూఁగుచున్



సరసత చౌకళింప మలిసంజల నాశ్రిత భక్తకోటికిన్
వరము లొసంగు దృశ్య మెడబాయక మ మ్మలరించుఁ గావుతన్. 11

మ. సమదైరావణ దిగ్గజంబు పయి నక్షత్రాళి సందీప్త నీ
లమహాకాశ నిభుండు రత్నఖచితాలంకార సంశోభియై
తమి నూరేగుచు తిర్మలన్ విభుఁడు భక్తవ్రాతముం బ్రోచు దృ
శ్యము మచ్చిత్తము నందు హత్తికొని హర్షాంభోధి నోలార్చుతన్. 12

తే. సర్వ దారిద్ర్య రోగ విషాదములకు
శాంతి సమకూర్పఁ జాలు ప్రశస్త మైన
'ఓన్నమో వేంకటేశాయ' యన్న నీదు
మంత్ర జపముండ భయమేల మాకు స్వామి! 13

* * *

# దేవా! కావరావా! ననున్

మ. నిను చుట్టమ్ముగ, తల్లిదండ్రులుగ, నా నేస్తమ్ముగా, ఒజ్జగా
వినఁగా వీనులు, కానఁగా కనులు, భావింపంగ ప్రేమార్ద్రమౌ
మనసుం గల్గిన వేల్పురాయనిగ శ్రీమద్వేంకటాద్రీశుగా
అనయంబున్ భజియించు సేవకుని దేవా! కావరావా! ననున్. 1

ఉ. ఎత్తిన జన్మ లెయ్యవియొ? ఎత్తగనున్నవి యేవొ? తొల్లి నా
యెత్తిన జన్మలందు కుల మేదియొ? జాతియు లింగ మేదియో?
వృత్తియు దేశ మెయ్యదియొ? యించు కెఱుంగను పండుటాకునై
యిత్తఱి రాలనుంటి; భయ మేర్పడెఁ; బ్రోవుము వేంకటేశ్వరా! 2

ఆ. పాము నోటఁ జిక్కి ప్రాణముల్ గోల్పోవ
సిద్ధమయ్యు కప్ప జిహ్వ సాచు
ఈగకొఱకు; అట్టు లేను మృత్యువునకు
చేరువయ్యు విడను జీవితాశ. 3

ఆ. ఆలు బిడ్డలందు అనుఁగుచుట్టములందు
మట్టుమీఱు నట్టి మమత నెల్ల
మట్టుపెట్టి మంచి మార్గాన నన్నుంచి
ఏడుకొండలయ్య! యేలుమయ్య! 4

క. నీ నామస్మరణమ్మును
నీ నామోచ్చారణమ్ము నీ దర్శనమున్
మానక సలిపెడు భాగ్యము
శ్రీనిధి! నా కొసఁగవయ్య! చేతులు మోడ్తున్. 5

* * *



# చతుర్భుజుఁ డాతని కంజలించెదన్

ఉ. కన్నులు లేనివాఁడు భువి కన్నులు కల్గినవాఁడు తోడ్పడన్
తిన్నఁగనేగు చందమున దీనదయాళుఁడ వీ వజస్రమున్
నన్ను కృపామతిం గనుచు నాకు హితం బొనరింప నీడ్చితిన్
మన్ననతోడ నీ బ్రదుకు; మా రమణీ రమణా! కృతజ్ఞుఁడన్. 1

చ. అడుగని వాని దోషమది; అంతియ; లేదను మాట నోట వె
ల్వడినది లేద; ఆర్తజనబాంధవుఁ డాతఁడు; కోరకుండ ని
చ్చెడి నెఱదాత యాతఁడు; కుచేలుఁడు మేడలు వేఁడెనే? మహా
త్ముఁడు నిఖిలం బొసంగఁడె? చతుర్భుజు ఁడాతని కంజలించెదన్. 2

ఉ. మావిచివుళ్ళ కంటె సుకుమారములై సుకుమారి యిందిరా
దేవి నిజాంకమం దునిచి తియ్యని పల్కుల నొత్త నొప్పుచున్
వావిరి నేవి సుస్థిర శుభమ్ము లొసంగునొ జీవకోటి; కా
పావన శేషశైల విభు పాదములన్ సతతంబు గొల్చెదన్. 3

శా. గోవిందా యనుచున్ ముకుంద యనుచున్ గోపాల యంచున్ మహా
దేవస్తుత్య పదాబ్జయంచు నిను భక్తింగొల్తు; నింతే ప్రభూ!
ద్యావా పృథ్వ్యవకాశ పూర్ణములు కల్యాణైకతానమ్ము లౌ
భావాతీత భవద్గుణావళుల నిర్వర్ణింప శక్తుండనే? 4

మ. శరదిందూపమ మైన మోమున సుధా స్వచ్ఛోర్ధ్వపుండ్రమ్ముతో,
శిరమందున్ వెలుగొందు వజ్రమకుట శ్రీభూషతో, నూతనా
భరణాలంకృత మంగళాంగములతో భాసిల్లు శేషాచలే
శ్వర! నా మానస పీఠమం దొక నిమేషంబైన కొల్వుండుమా! 5

చ. విపినమునందు దేహమును వీడిన తత్క్షణమే శిలామయం
బపఘనమున్ ధరించి వృషభాద్రికిc జేరిననాటి కృష్ణుcడే
అపరిమిత ప్రజానివహ మాదట తన్ను భజింప మక్కువన్
విపులసుఖ ప్రదాతయయి విశ్వము నేలుచునున్నవా cడహో! 6

క. చరమశ్లోకార్థము నిజ
చరణములన్ చేతcజూపి చాటెడు విశ్వం
భరు నితని శరణుc జొచ్చుట
మఱచిన మతి లేదు సుగతి మానవ తతికిన్. 7

* * *



# బదరీనారాయణా పాహిమామ్

చ. తనదు కమండలూదకపుధారల నే పరమాత్ము లోకపా
వన చరణమ్ములం గడుగ వారిజ గర్భుcడు తజ్జలంబు పా
యని దృఢభక్తి మస్తకమునందు ధరించె శశాంకశేఖరుం;
డనిశము నావృషాద్రిపతి నర్మిలి గొల్చెద నిష్టసిద్ధికై. 1

చ. తిరుమలవంటి క్షేత్రమును తిర్మల సామినిబోలు వేలుపున్
ధరణిని చూడcబోమనుట దబ్బర గాదని తైర్థికాళి సా
గర చలదూర్మికా పటలి కైవడి సాగుచు సల్పు వేంకటే
శ్వర గుణకర్మ సంస్తవన శబ్దము దిక్కుల పిక్కటిల్లెడున్. 2

చ. తిరుమల జేరి పుష్కరిణి దివ్యజలమ్ముల స్నానమాడి భూ
వరుని వరాహమూర్తి గని బ్రహ్మముఖామరవంద్యు వేంకటే
శ్వరు నినుcజూచి కాన్కలిడు భక్తుల పాదపయోజధూళిలో
పొరలెడు భాగ్యమీగదవె పుణ్యవృషాచల హేమ మందిరా! 3

చ. ఉపలమువంటి నా హృదయ ముత్పల సూనమటుల్ భవత్పద
ప్రపదన సౌరభమ్మునకు భక్తి మధూళికి తానకమ్మునై
యెపుడు రహింప కేల్మొగిచి యెంతయు వేcడుచునుంటి దేవరా!
జపము తపమ్ము లేని పశుజాతికి చెందినవాcడc బ్రోవరా! 4

తే. నీకు నచ్చిన గుణములు నీవు మెచ్చు
గుణము లొక్కటియున్ లేని కూళ నేను;
నీవు శరణాగత త్రాణ నియమశీలి
వందులకె వ్రాలినాcడ నీ యంఘ్రియుగళి. 5

శా. శ్రీరంగమ్మున రంగనాయకులుగా, సింహాద్రి అప్పన్నగా
శ్రీరాముండుగ భద్రశైలమున, కంచిన్ దేవరాణ్మూర్తిగా
స్ఫారోదారత వెల్గు వేంకటపతీ! స్వామీ జగన్నాథ! బృం
దారణ్యాంత విహారలోల! బదరీనారాయణా! పాహి మామ్. 6

# గోవిందాయ నమో నమః

శా. గోవిందాయ నమోనమో యనుచు సంకోచింప కే ప్రొద్దు మా
దైవం బాశ్రిత కల్పకంబు సకలాంతర్యామి పద్మావతీ
దేవీవల్లభుఁ డంచు నెంచి నిను భక్తిం గొల్చుచుంటిన్ ప్రభూ!
నా వైపే కనువిచ్చి నీవు గన కున్నన్ నాకు ది క్కున్నదే? 1

ఉ. పున్నమనాటిచందురునిపొల్పు కనుంగొని పొంగు సంద్రమ
ట్లున్నది నా మనంబు భవదుజ్జ్వలపావనపాదసన్నిధిన్;
ని న్నఖిలాండకోటినళినీప్రభవాండపతిన్ కృపామతిన్
కన్నుల కాటకం బుడుగ కాంచెడు భాగ్యము ని ట్లొసంగవే? 2

తే. శివు జటాజూటమున కెంతొ చెలువ మొసఁగు
నవవికచకుందదామమ్ము దివిజగంగ
ఎవని చరణాంబుజము నుండి యవతరించె
అట్టి దేవాదిదేవు ని న్నాశ్రయింతు. 3

ఆ. ఆలుబిడ్డలందు అఖిలబాంధవులందు
తల్లిదండ్రులందు ధనమునందు
ఉన్న ప్రేమలోన ఒక్కింత నీమీఁద
కలుగఁ జేసి నన్ను కావు మయ్య! 4

క. నీవు హృషీకేశుండవు
నే వశుఁడ హృషీకములకు; నిను ప్రార్థింతున్
దేవ! మదంతఃకరణము
నీ వంకకు మరలునట్లు నియమింపు కృపన్. 5

తే. చక్రమున నక్రముం జంపి సామజమును
కాచిన విధమ్మునన్ నాదు కలుషరాశి
భస్మముంజేసి దీను పావను నొనర్చి
ఎపుడు నీ దాసదాసుగా నేలుకొమ్ము. 6



# ఎవరి దారి వారిది

మ. కలయో తావకమాయయో మతి యెఱుంగం జాలకుంటిన్; మహా
ప్రళయాభీలము దృశ్యమున్ గతతమిస్రన్ నాకుఁ జూపించినా;
విల వైకుంఠము నీదు పత్తనమునం దీదృశ్య మారంభమై
తెలుపన్ శక్యముగాని నిర్వృతి నిడెన్ దేవా! వృషాద్రీశ్వరా! 1

మ. నరనారీచయముల్ మహోత్సుకత ప్రాణత్యాగముంజేయ సుం
దరముల్ పందిళులందు గుట్టలుగ నేతత్కాయముల్ చూడ్కికిన్
వెఱఁగున్ గూర్చెను; తూర్యనాదములతో విచ్చేసి యట్లో జనో
త్కరమున్ లెక్కిడఁగా నశక్య మని స్వాంతమ్మందు భావించితిన్. 2

ఆ. బ్రతుకుకంటె చావు పరమసుఖం బని
తలఁచినార లేమొ తనువు ప్రక్క
తనువుఁ జేర్చి వారు కనులు మూసిరి; శాంతి
గడలు కొనియె దచ్చికడలయందు. 3

తే. ఏడుపులు బొబ్బలున్ లేని యిమ్మహాభి
నిష్క్రమణ దృశ్యముం గాంచి నేను గూడ
శుద్ధ బుద్ధ స్వరూపినై సొలసి సొలసి
ఉసురు వాయంగ కృతనిశ్చయుండనైతి. 4

తే. కోష్ణ జలకుండములఁ దేలు గొప్పగొప్ప
దేహముల ప్రక్క శయనించి దీర్ఘనిద్ర
ఎంతసేపటికిన్ రాక యేగినాఁడ
వేఱుచోటికి నసువులు వీడనెంచి. 5

తే. అద్ది సువిశాల మండప; మచట కన్న
డాంధ్ర మలయాళ తమిళాదులైన పెక్కు

బాస లాడు వారలఁ గాంచి వారి పొంత
నెంత తడవున్న జీవమ్ము లేగవయ్యె. 6

తే. నెమ్మొగాల నున్న నిలువు బొట్టులతోడ
అడ్డబొట్లతోడ అందమైన
సిగలతోడ చెంగుచెంగున నెగురుచు
కుఱ్ఱగుంపు లొకట గోచరించె. 7

క. వీణలు వాయించుచు, మఱి
వేణువు లూదుచు, మృదంగవిన్యాసమ్ముల్
మానుగ నెఱపుచు, పాడుచు
వీనులకున్ విందు లొసఁగు విజ్ఞులఁ గంటిన్. 8

క. చిరుచెమటల పరిమళములు
పరవఁగ లాస్యంబు సలుపు పద్మినుల హొయల్
పరికించుచు కొండొకయెడ
కరిగితి అరుసమ్ము హృదిని అలుగుఁలు వాఱన్. 9

క. నా లోపల నే నేదియొ
ఆలాపించుచును నచట నట్టిటు తిరుగన్
గాలి దుమారము రేఁగెను
నీలాభ్రచయంబు చదల నిబిడం బయ్యెన్. 10

తే. కాగడా లాఱిపోవ నాకస్మికముగ
కారుచీఁకట్లు దిక్కులఁ గ్రమ్ముకొనియె;
"మిత్రమా! ఈడ నున్నాము మేము; మమ్ముఁ
జేర" రమ్మను పిల్పులు చెవులఁ బడియె. 11

తే దూరమున నుండి వీతెంచు వారి పిలుపు
లేను విని యచ్చటికి పోక యెవరిదారి



వారిదే సుండు; నా దారి వాసుదేవు
నంఘ్రికమల భరన్యాస మని నుడివితి. 12

తే. ఆలు బిడ్డలు నల్లుండ్రు నసుఁగు మనుమ
రాండ్రు మనుమలు చుట్టము లాప్తసఖులు
వెదురుపొదలట్లు లున్నారు; వీరి జాడ
లరయు వాంఛ చిత్తమునందు హత్తదయ్యె. 13

తే. పుత్రదార గృహాదుల పొరి నసక్తి
ఇష్టము లనిష్టములయందు నిద్ధమైన
సమమనస్కత యొదవునే జనున కెందు
వేంకటేశ్వర! నీ కృపాభిక్ష లేక. 14

మ. "హరి! నారాయణ! వారిజాక్ష! వరదా! ఆర్తావనా! పావనా!
కరుణాసాగర!" యంచు సాగర తరంగ శ్రేణికిన్ సాటియై
పరిఘోషించుచు వచ్చు భక్తతతికిన్ ప్రత్యుద్గతుల్ సల్పుచున్
పరమానందము నొందినాఁడను ప్రభూ! పద్మావతీవల్లభా! 15

తే. "అంత్యకాలమ్ము నందు న న్నాత్మయందు
సంస్మరించుచు కాయమ్ము జాఱవిడుచు
జనుఁడు నాకడ కరుదెంచు" ననుచు నీవు
గీతలం దెల్పితివి గాదె! కృష్ణమూర్తి! 16

తే. మంత్రమూర్తివి అలమేలు మంగపతివి
నీదు తిరుమంత్రమును, మహనీయ మంత్ర
రత్నమును నాదు నాల్కపై రాజిలంగ
జప మొనర్పంగఁ దొడఁగితి శక్తికొలఁది. 17

చ. గరుడని మూపుపై బహుసుఖంబుగ నుండి వినూత్నభూషణాం
బరరుచు లంబరమ్మునను బర్వఁగ నాల్గువికుంఠవీథులన్

తిరిగెడు సంబరమ్ము బలు దివ్వటి వెల్గులఁ జూపి నన్ను స
త్వరముగ నుద్ధరించితివి; ధన్యుఁడ నైతిని భక్తవత్సలా! 18

క. ఈ కల యిట్లే సాగిన
వైకుంఠవిభుండ! యెంత బాగుగ నుండున్?
నీ కొలువుబంట నగుటను
నాకున్ పనిగలదు గావునన్ కల చెదిరెన్. 19

* * *



# పద్మదళాక్షున కంజలించెదన్

ఉ. నింగియు నేల ఒక్కటిగ నిల్చిన దీప్తమనోజ్ఞమూర్తితో
ముంగిటిపెన్నిధానమయి మ్రొక్కెడివారికి; కొల్చువారికిన్
తంగెటిజున్నునై; తలఁచు ధన్యుల కెల్లను వేల్పుగిడ్డియై
బంగరుకోవెలన్ వెలుఁగు పద్మదళాక్షున కంజలించెదన్. 1

ఉ. లెక్కిడవచ్చు చుక్కలను; లెక్కిడవచ్చును వానచిన్కులన్;
లెక్కిడవచ్చు అయ్యసుకరేణుల తింత్రిణిపత్రజాతమున్;
లెక్కిడ శక్యమా? హర విరించి ముఖాఖిల దేవసంఘముల్
తక్కక వేఁడు శేషఫణితల్పు మహామహిమానుభావముల్. 2

తే. లికుచ కుచల వినీలమిళిందకచల
కౌఁగిళులె పరనిర్వృతి లోఁగిళు లని
యెంచు మాదృశులను కరుణించువార
లెవరు? వాత్సల్యవారాశి వీవు దప్ప. 3

తే. అన్నిగుండెల తాపమ్ము లార్చుపొంటె
దట్టముగ రొమ్మునందు గందం బలందు
కొంటివా? దేవ! నీవంటి గొప్పతండ్రి
లేఁడు నిఖిలజగమ్ముల లేఁడు లేఁడు. 4

తే. పామరసుఖంబులకు సదా పరుగు లెత్తి
బడలిపోయితి; మంచంబు తొడుసునైతి
ఆర్తరక్షక! ప్రాణభయార్తి గదుర
పొర్లుదండమ్ము లిడుచుంటిఁ బ్రోవుమయ్య! 5

తే. శంఖచక్రగదాఖడ్గచాపహస్త!
పుండరీకాక్ష! గోవింద! భువనవంద్య!
ద్రౌపదీమానరక్షక! దాసదాసు
నన్ను శరణార్థిఁ గావు మనాథనాథ! 6

## పామరుఁడు క్రొత్తగా నేమిపలుకఁగలఁడు?

ఉ. తల్లిని తండ్రినిన్ గురుని దైవతమున్ పరిపూర్ణభక్తితో
నెల్లపుడున్ భజించు జను లేకులమందునఁ బుట్టిరేమి? వా
రెల్లరు దారితో డగుచు నెప్పుడు నన్నెడఁబాయకుండ ఓ
చల్లని వేంకటాచలముస్వామి! వరమ్ము ననుగ్రహింపుమా! 1

మ. నిను దూషింపఁగ కంసముఖ్యులు ఖలుల్ నీకృష్ణజన్మమ్ములో;
ఫణిశైలాధిపుఁ డౌచు నీవు మరలన్ ప్రాదుర్భవించంగ నీ
ఘనమాయామహిమంబొ యేమొ! నిను నొక్కండైన పల్లెత్తుమా
టన కత్యుత్కట భక్తితోఁగొలుచు టత్యాశ్చర్యమూలంబగున్. 2

ఉ. తిట్టినతిట్టు తిట్టకయ తిట్టిన చైద్యునికిన్ విరోధికిన్
నెట్టన మోక్షమిచ్చితివి; నిన్ను నుతించుటదప్ప నెట్టి యి
క్కట్టుల వేడిపల్కు పలుకన్ గమకింపని దాసకోటికిన్
గట్టెడి పట్టమేదొ వినఁగా మనసాయెను వేంకటేశ్వరా! 3

ఉ. దేవుఁడ వీవు; జీవుఁడను దిక్కును మ్రొక్కును లేనివాఁడ; నీ
కోవెలచుట్టు ఁగ్రుమ్మరుచు గొబ్బునఁబ్రోవుమటంచు వేఁడెదన్;
నా వివిధాఘముల్ దలఁచి నా మెడఁబట్టి తొలంగఁ ద్రోసినన్
దేవర! యేడ కేగెదను తెల్పుము నీవె దయాపయోనిధీ! 4

తే. పాడినదె పాడుచుంటివి పాచిపండ్ల
దాసరీ! యని నవ్వకు; తావకీన
పరమదివ్యానుభవము రవంతలేని
పామరుఁడు క్రొత్తగా నేమి పలుకఁగలఁడు? 5

తే. బ్రహ్మరుద్రాదులకుఁగూడ భవదనంత
మంగళగుణౌఘమును గూర్చి మాటలాడ
శక్తిలేదన్నయపుడు నా జపతపాలు
చదువుసాము లవెంత? శేషగిరినాథ! 6



## విష్ణుపత్ని నమోఽస్తుతే విశ్వజనని!

తే. శంఖచక్ర గదాఖడ్గ శార్ఙ్గ గరుడ
సైన్యపతి సాధ్య ముఖ పరిజన నిషేవ్య
మాణ పరమపదాస్థానమండపమున
విభునితోఁ గొలువుండు దేవీ! జోహారు. 1

తే. స్థలితకంకణమాల్యబాహుల మురారి
దధి మథించినటుల్ వార్ధిఁ ద్రచ్చువేళ
శ్రాంతిశాంతికి స్మితనయనాంతసుధలఁ
జిలుకరించుచుఁ జిన్నివెన్నెలను బోలె
భ్రమదమృతవీచికావర్తభవము గంటి
విష్ణుపత్ని! నమోఽస్తు తే విశ్వజనని! 2

తే. పుండరీకాసనంబుననుండి చరణ
మొకటి మా నతికై చాచి, యొక్కకాలు
ముడిచి, యభయహస్తముతోడ, ముగ్ధమధుర
ముఖముతో వెల్గు తల్లిరో! సుఖము లిమ్ము. 3

తే. జ్ఞానతేజో బలైశ్వర్య శక్తి విజయ
శీలతా ప్రేమముఖ గుణజాలమునకుఁ
గాంతి లావణ్య పరమసౌగంధ్యములకు
నీ విభుం డెట్లొ యట్టులే నీవు తావు. 4

తే. సుందరం బేది? యానందకంద మేది?
యద్భుతం బేది? యేది కాలాతిగంబు?
వాఙ్మనసదూర మేది? యా పరమపదము
నీదు నిత్యవిభూతిగా నిగమ మెంచె. 5

తే. నీకు లీలావిభూతి యీ నిఖిలజగము;
నిత్యసూరులు సేవకుల్; నీకు శేషి
మురరిపుండు; బుభుక్షుముముక్షువులకు
మాకు శరణంబు నీ కృపామధురదృష్టి. 6

తే. భక్తిసిద్ధాంజనమ్ముచే భావవీథి
వఱలు త్వద్రూపగుణవిభవమ్ము శ్రుతిశి
రోనిగూఢమ్ము నిధివలె జ్ఞానదృష్టిఁ
జూచు ధన్యులు మోక్షమ్ముఁ జూఱగొంద్రు. 7

తే. ప్రాణవల్లభుఁ డగు శ్రియఃపతివి నీవి
నిఖిలగుణదోషములను గణింపఁ దరమె?
ప్రథమరాశి యనంతమై పరఁగుఁగానఁ
బశ్చిమ మభావ మగుచు దైవాఱుఁగాన. 8

తే. ప్రాక్కవులు మెచ్చెదరు భగవతిని శ్రుతిని
తావకగుణౌఘ మణికోశధామ మనుచుఁ,
దత్కవాట విపాటన దక్షములుగ
స్మృతిపురాణేతిహాసనంతతి వచింత్రు. 9

తే. దేవి! త్వన్మహిమావధి నీవుగాని
యచ్యుతుఁడు గాని తెలియలే రంట! యట్టి
యనవధిగుణాఢ్య నేమని యభినుతింతు?
శిరము వంచి నమస్కృతుల్ సేయువాఁడ. 10

తే. ప్రకృతిమధురమ్ము నీ శరీరమ్మునకును
పంచదార పాలకుఁబోలె, ప్రసవసమితి
కల్పలతికకుఁ బోలె ముక్తాసువర్ణ
భూషణశ్రేణి యింపు సొంపులు ఘటించు. 11



తే. వాసుదేవువక్షస్థ్సలి వైజయంతి
హిమజలప్లుతిచే వలె నెవతె యడుగుఁ
దమ్ము లొరసి నవతఁ దాల్చుఁ దత్పదముల
సురభితాగమాంతమ్ముల స్తుతి యొనర్తు. 12

తే. యౌవనాదిక ముభయతుల్యంబె యయిన
శత్రుశమన స్వతంత్రతా స్థైర్యముఖ్య
పుంస్త్వ సులభగుణమ్ము లొప్పు హరియందు;
పరమకరుణా క్షమా భర్తృపారతంత్ర్య
ముఖ్య వనితైకనిష్ఠముల్ భూరిగుణము
లెసఁగు నీయందు; నిర్వర కేము శేష
భూతులము; తండ్రియని విష్ణుమూర్తి, నిన్నుఁ
దల్లి యని నమ్మి దుఃఖాబ్ధి దాఁటఁగలము. 13

తే. విటుల వంచించు నంగనావేషధారి
చెల్వునన్ శౌరి నిజమాయ జీవకోటి
విషయపరతంత్రులుగ దాస్యవిభవ విస్మృ
తాత్ములుగఁ జేయు నీ పరీహాసమునకె. 14

తే. నీకుఁ బ్రియ మాచరింపంగ నీవిభుండు
కడలిఁ బవళించె, మథియించెఁ, గట్టివైచె;
సమరదుర్జయు రావణు సంహరించె;
నేమిసల్పఁడు నీకుగా నినకులుండు? 15

తే. నీకు మైథిలజన మెట్లొ నేము నట్లె
అంబ! తావకదాస్యరసాభిమాన
భావమున నల్లుఁడని నీదువల్లభుఁ డని
హరి భజించుచు మోదింతు మనుదినంబు. 16

తే. కాకమును వైరిసోదరుఁ గాచినట్టి
పతికరుణ యెంత? హనుమంతుబారినుండి
బ్రోచితివి పదినెలలు నిన్ రాచినట్టి
రాక్షసస్త్రీల; నీ దయ రక్షమాకు. 17

తే. శతసహస్రాపరాధముల్ సలుపు జనులఁ
గని కనలు స్వామి హితమెంచు జనకుఁబోలె;
ఉర్వి నిర్దోషుఁ డెవఁడంచు నుచితమాడి
చల్లపఱతువు గనుక మా జనని వైతి. 18

తే. ఎవఁడు నీ కంజలి ఘటించు నెప్పుడేని
యతని కైశ్వర్య మక్షరగతి నొసంగి
కించిదుచితోపకృతి సల్పనంచు సిగ్గు
చెందె దఁట! యింత యౌదార్య మెందుఁ గందు? 19

తే. ఏను తావక దాస్య సుఖైకసంగి
నిలయములఁ గీటజన్మంబు వలతుఁగాని
యన్యగృహముల బ్రహ్మగానైనఁ బొడము
పరమదౌర్భాగ్యమున కొడంబడ నిజమ్ము. 20

తే. నీదుకడగంటిచూడ్కుల నివ్వటిల్లు
దార పుత్త్రావసథ ధనధాన్య లాభ,
మాయురారోగ్య భోగభాగ్యాభివృద్ధి,
శాత్రవజయంబు, శాశ్వతైశ్వర్యసిద్ధి. 21

తే. మీ కటాక్షప్రసృతి యెందు మెండుకొనెనొ
యది పరబ్రహ్మ మాయె; నింద్రాదికమ్ము
వెలసె నొకరెండుచూడ్కులు పొలయ ననుచు
వినుతి యొనరించె నినుఁగూర్చి వేదరాశి. 22

తే. ఆవిరించనాకించన మ్మామహీజ
విబుధదేశిక మాబలివిక్లబమ్ము



సదసదాత్మమ్ము జంగమస్థావరమ్ము
జగము నిమ్నోన్నతమ్ముగా సాఁగుటకును
దలఁపఁ గారణ మో యమ్మ! త్వత్కటాక్ష
వీక్షణావీక్షణమ్ముల విలసనమ్మె. 23

తే. ఎవనిఁ దిలకింతువో కటాక్షేక్షణముల
నతఁడె శ్లాఘ్యుండు గుణవంతుఁ డతఁడె బుద్ధి
మంతుఁ డాతండె ధన్యుండు మహిత శూరుఁ
డతఁడె విక్రాంతుఁడు కులీనుఁ డతఁడె సుమ్ము. 24

తే. అధికమో యల్పమో ధన మవనిజనులు
పొందఁ గల్గుట నీ చూడ్కి పొలపముననె;
త్వత్కటాక్షభాజనుఁ డౌటఁ దన్ను ధన్య
తమునిగఁ దలంచు హరి జగద్భర్త యయ్యు. 25

తే. అమృతసఖి ! నీదుభ్రూలత యన్ముఖముగఁ
దతకృపన్ సంచలించునో తన్ముఖముగ
ధృతి సరస్వతి మతి రతి శ్రీ సమృద్ధి
సిద్ధి యహమహమికఁ జింది చింది పాఱు. 26

తే. సమదగజమెక్కి మౌక్తికచ్ఛత్ర మొప్ప
మణిమకుటధారి యొక్కండు మలయుచుండ
నొకఁడు కృపణతఁ గేల్సాచు నొదిగి, నీవు
కనుట మానుట లింతకుఁ గారణములు. 27

తే. కతిపయగ్రామనాయకగణము మొదలు
సర్వనిర్వాహకప్రభుచయము వఱకు
దొరలెడు గుణోత్తరమ్ములౌ సిరులు నీదు
వీక్షణసువృష్టి నైదాఘ విప్రుషములె. 28

తే. ఎవనిపై నీ యనుగ్రహదృష్టి పడునొ
యతఁడె సాత్త్వికుఁ డతఁడె మోక్షార్థచింత
కుఁడు జనని! నీ యపాంగమ్ము కుంటివాని
గిరుల నెక్కించు మూగ వాగ్మిగ నొనర్చు. 29

తే. నీవు గైకొంటి మంగళదేవతాఖ్య;
మంగళపదంబు సమకూడె మధురిపునకు
తావకస్పర్శ; విరికిఁ గ్రొందావి వన్నె
కారణ మ్మెందుఁ గలదె సౌగంధ్యమునకు? 30

తే. పద్మపత్రనిభేక్షణ! పద్మహస్త!
పద్మవదన! పద్మాలయ! పద్మనాభ
పత్ని! దేవి! అకించనప్రథము నన్నుఁ
గరుణ దొలఁకాడు కన్నులఁ గాంచు మమ్మ! 31

తే. మోక్షమం దిచ్చు యర్హత దక్షతయును
అనుశయము లేని మూర్ఖుఁడ నమ్మ! జ్ఞాన
కర్మభక్తిప్రపత్తులఁ గటికపేద
నమ్మ! మీ యిర్వురకు దుస్సహమ్ములైన
దురితములు సల్పి కటకటా! దుర్భరుండ
నైతిని గదమ్మ! నీవె దిక్కంటి నమ్మ! 32

తే. పుట్టినిల్లు క్షీరాబ్ధిపై, మెట్టినిల్లు
పరమపదముపైఁ గల ప్రీతి మఱచిపోయి
శ్రితుల మముబోంట్లఁ గాపాడ మతిజనించి
శ్రీశుకపురంబు గూర్మిఁ జేరితివి తల్లి! 33

తే. మొదట భృగువంశమందు; నా పిదప నుదధి
సుధకయి సురాసురుల్ చిల్క నుదయమైతి;



ధర్మసంస్థాపనార్థమై దైత్యదమనుఁ
డెప్పు డే యవతారమ్ము లెత్తుచుండు
నప్పు డనురూప దేవతిర్యఙ్మనుష్య
తనువులన్ సహధర్మిణీత్వము భజింతు;
వాతఁ డాదిత్యుఁ డైనప్పు డైతి పద్మ;
వతఁడు భృగురాముఁ డైనప్పు డై తి ధరణి;
వతఁడు రఘురాముఁడైన సీతమ్మ వయితి;
వతఁడు శ్రీకృష్ణమూర్తియై యవతరింప
నీవు రుక్మిణి వైతివి; నేటి కలిని
స్వామి శ్రీవేంకటాచలేశ్వరుఁడు గాఁగ
వేడ్క నలమేలుమంగవై వెలసి భక్త
సులభవై యాశ్రితులపాలి సురభి వగుచు
వఱలుచుంటివి శ్రీశుకపురిని నీకు
మాత! పద్మావతీ! జయమంగళమ్ము. 34

తే. తల్లికిం దొలిమ్రొక్కులు తగు నటన్న
శ్రుతివచనమున్న వేంకటపతికి మొదట
అంజలి ఘటించి పిదప నీయడుగుదోయి
ఎదనిడితి; యిట్టిసేఁత నీ కిష్టమగుట. 35

తే. సహసుహృద్బాంధవముగ నిష్కంటకమ్ము
దాస్యరసికంబు సుసుఖంబు దైన్యరహిత
మైన భోగానుభవ మిచ్చి యవల తల్లి!
పేర్చుకృప నన్ను నీ యొడిఁ జేర్చికొమ్ము. 36

శ్లో. శ్రియః కాంతాయ కల్యాణ నిధయే నిధయేర్థినామ్,
శ్రీ వేంకటనివాసాయ శ్రీనివాసాయ మంగళమ్.

* * *

